జంట పక్షులు

నాగభూషణ్

రంగము 1

అప్పుడే ప్రొద్దుగూకింది. తెర లేచేసరికి ప్రేక్షకులకు చీకటిగా వున్న హాలు కనిపిస్తుంది. ఈ చీకటిలో ఒక ఆకారం అటూ ఇటూ కదుల్తూ, అవీ ఇవీ సర్దుతూ వుంటుంది. ఇంతలో మరో ప్రక్కనుంచి మరో ఆకారం సిగరెట్టు కాలుస్తూ ప్రవేశిస్తుంది.

సిగరెట్ మనిషి: గదులన్నీ సిద్ధంగా వున్నయ్యా?

మొదటి మనిషి: చిత్తం సార్!

సి.మ: అన్ని గదుల్లోనూ సామాను సరిగా సర్దించావా?

మొ.మ: చిత్తం సార్.

సి.మ: అంతా మామూలుగానే జరగాలి. ఎక్కడా పొరపాటు జరగకుండా చూడు.

మొ.మ: నిండా జాగ్రత్తతో వుందును.

(సిగరెట్ తాగుతున్న మనిషి వెళ్ళిపోతాడు. ఇంతలో వీధి తలుపు చప్పుడవుతుంది. మొదటి మనిషి వెళ్ళబోతున్న వాడు, వెనక్కు వచ్చి, లైట్ స్విచ్ వేసి, వీధి తలుపు తీస్తాడు. ఆ లైటు వేసింది లోకనాథం – బట్లరు; ఆ యింట్లో యజమాని తరువాత యజమాని అంతటి వాడు. కొంచెం బొద్దు మనిషి. వేషమూ, భాషా కూడా యాస.

ఇక ఆ హాలు – ఆ యింట్లో అతిథుల కోసం ప్రత్యేకించబడినది – నిజంగా గది కాదు, ముందు హాలు మాత్రమే. కాని దానికి వున్న రెండు వాకిళ్ళకు గట్టి కర్టెన్లు కట్టివుంచడంతో ముందు హాలుకు వుండే ఆసౌకర్యాలేవీ ఎడమవైపునుంచి యింటిలోకి రాకపోకలు జరుగుతాయ్; వెనక ప్రక్కగా ఓ కిటకీ వుంది. చుట్టూ మూడు కుర్చీలు వుంటయ్. అటూ యిటూ వున్న రెండు సోఫాలు, పైన తిరుగుత్ను సీలింగ్ ఫాన్, డూంలైట్లు, క్రింద పరిచిన తివాసీ – ఇవన్నీ అదొక భాగ్యవంతుడి ఇల్లని చెబుతాయ్.

బట్లర్ తలుపు తీస్తాడు. రామమూర్తి లోపలకు వస్తాడు. సగం లోపలకు వచ్చి గదిని చూచి ఆశ్చర్యపడతాడు. ఫ్రెంచికట్ మీసం, మధ్యగా పాపిడి తీసి వెనక్కు దువ్విన జుట్టు – ఇరవయ్యో శతాబ్దంలో బ్రతికే యంత్రంలాంటి మనిషి)

రామ: ఆ! చూడండి...ఇది హోటలేనా?...మేము దారి తప్పినట్లుగా వున్నాం....ఈ రాత్రికి యిక్కడే వుండొచ్చని మా జవాను చెప్పాడు. (వెనక్కు తిరిగి పిలుస్తూ) చూడు రాముడూ! ఇది హోటల్‌లా లేదే!

జానకి: (లోపలనుంచి) రాముడెక్కడికో వెళ్ళాడు రాం!

మూర్తి: (లోపలికి చూస్తూ) వెళ్ళాడా? ఏ మొచ్చింది?

బట్లర్: రాముడు శానా నిజం చెప్పినాడు సార్. ఇది 'ఒక రకం' హోటలే!

మూర్తి: ఇంతకూ వాడు ఎక్కడకు వెళ్ళాడు?

జానకి: నువ్వు కారులోంచి దిగగానే వెళ్ళాడు రాం! ఇది నిజంగా –

(ఈ మాటలంటూ ఆమె లోపలకు వస్తుంది. మూర్తి చెయ్యి మృదువుగా పట్టుకుని వుంటుంది. అందంగా, అమాయకంగా కనిపించే కళ్ళు, వాటి వెనక దాగివున్న వల్లమాలిన అల్లరి, నవ్వినప్పుడు కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. ప్రస్తుతం జరిగిన కొన్ని ఆసాధారణమైన విషయాలవలన నిస్పృహతో కనిపిస్తుంది)

బట్లర్: రాముడు నిజమే చెప్పినాడు సార్.......ఇది ఒక రకం హోటలుదా! అవును.

మూర్తి: ఇంతలో వాడెక్కడికి వెళ్ళాడు?

బట్లర్: కారు లోపల పెడుతున్నాడు సార్...అయ్యగారు –

మూర్తి: మేం – ఈ ఒక్క రాత్రికే – ఇక్కడవుండడానికి వీలుంటుందా? నేను....ఆ.....మా ఆవిడ, నేను.

బట్లర్: దానికేమి సార్!.....లోపలికి –

మూర్తి: (లోపలకు వెడదాం అన్నట్లుగా జానకి వంక చూస్తూ) ఈ పరిస్థితుల్లో మనం ఇంత కంటె యింకేం చెయ్యలేం,జానీ! జరిగినదానికి నాకు చాలా విచారంగా వుంది...కాని, ఈ కాస్తలో –

జానకి: (బట్లర్ ముందు అలా మాట్లాడతా వేం? అన్నట్లుగా చూస్తూ) ఫరవాలేదు. ఈ ఒక్కరాత్రికే కదా!

బట్లర్: ఇంకేం సార్! లోపలకు రండి.

(ఇద్దరూ లోపలకు వస్తారు. రాగానే తలుపు గడియవేసి, కర్టెన్ సరిగా లాగుతాడు బట్లర్. ఈ చప్పుడుకు వెనక్కు తిరుగుతుంది జానకి. తలుపు వెయ్యడం చూచి నిశ్చేష్టురాలవుతుంది. మూర్తి అక్కడ వున్న కుర్చీలు, బల్లలూ చూస్తూ 'ఈ హోటలు చాలా తమాషాగా వుందే!' అనుకుంటాడు)

మూర్తి: (స్థిరంగా కూర్చుంటూ) మాకు ఆకలిగా వుంది –

జానకి: నాకేమీ అక్కర్లేదు, రాం –

మూర్తి: ఛా! అదేమిటి జానీ!

బట్లర్: భోజనం అయిదు నిమిషాల్లో వడ్డిస్తారు సార్!

జానకి: (హఠాత్తుగా) ఎవరో ఏమో నీకు తెలుసా?

బట్లర్: అదేమి సార్! నాకేమీ తెలియును?

మూర్తి: (ఇష్టం లేనట్లుగా) పోనీ జానీ.

జానకి: ఫరవాలేదు రాం.......(బట్లర్‌తో) ఏం?

బట్లర్: అయ్యగారు, మీరు ఆయనగారి భార్యగారు అని చెప్పినారు కదమ్మా!

జానకి: ఆ...అవును...అయితే? ఆయన్నిప్పుడు చూస్తున్నావు కాబట్టి ఎరుగుదువా?

మూర్తి: (పూర్వం మాదిరిగానే) దాన్లో ఆశ్చర్యం ఏముంది?

బట్లర్: అయ్యగారి ఉద్యోగం ఏమో తెలియునమ్మా! కాని పేరుదా తెలియదు.

మూర్తి: (ఆశ్చర్యంతో) నా ఉద్యోగమా?...ఎట్లా తెలుసు?

బట్లర్: భోజనం అయిందేమో చూసివద్దును సార్!

(వెళ్ళిపోతాడు. ఒక క్షణం అతను వెళ్లిన వైపే చూస్తూవుంటారిద్దరూ)

మూర్తి: (నిట్టూరుస్తూ) తమాషాగా వుందే!

జానకి: నాకు మాత్రం ఏమీ బాగాలేదు, రాం.

మూర్తి: ఛా! అదేమిటి జానీ?

జానకి: మనం వస్తామని వాళ్ళకు ముందే తెలిసినట్లుగా వుంది.

మూర్తి: (నవ్వుతూ) పిచ్చిపిల్లా! వాల్ళ కెలా తెలుస్తుంది? సరిగ్గా మన ప్రయాణం సాగివుంటే మనం ఈ పాటికి హైదరాబాదులో ఉండే వాళ్ళం.

జానకి: (బాధగా) నిజమే! కాని లేము కదా!

మూర్తి: ఆ కారూ, ఆ రాముడూ....అందరూ దొరికారు. అన్నీ ఆటంకాలే!

జానకి: ఈ వినాయకుడి పెళ్ళికి అన్నీ విఘ్నాలేనంటావ్!

మూర్తి: (జానకి ఈ మాటలు ఏ వుద్దేశ్యంతో అన్నదా అని సూటిగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ) అట్లాగే వుంది!

జానకి: (లాలనగా) నీకీ ఆటంకాలు ఎప్పుడూ వస్తూనే వుంటయ్యా?

మూర్తి: జానీ! ఏమిటి నువ్వనేది? నేను నిజంగా కావాలనే ఈ ఆటంకాలు కలిగించానా?

జానకి: అబ్బే! లేదు...కాని ఇన్ని రాత్రుల్లోనూ ఈ రాత్రే జరగాలా యివన్నీ? (దూరంగా వున్న సోఫాలోకి వెడుతుంది)

మూర్తి: నిజమే! కారు చెడిపోవడం....ఆలస్యం అవడం వల్ల రైలు అందకపోవడం – అయితే యేం? రేపు పదిగంటలకల్లా హైదరాబాదులో ఉంటాం.

జానకి: రేపు పదిగంటలు! కాని ఆ తేడా వుండనే వున్నది కదా! ఈ తెలుగువాళ్ళ పొలిమేరల్లో గడిపే ప్రతిక్షణం నాకు భరింరానిదిగా వుంటుంది.

మూర్తి: నిజమే! కాని –

జానకి: నేను చెప్పేది విను, రాం. నేను ముందు గానే చెప్పాను; ఇది నన్ను లేవదీసుకురావడం కాదు; దీనికోసం తంత్రాలు పన్ననక్కరలేదు, అబద్ధాలు, నటనలూ అనవసరం అని. మనం కొత్తదేశంలో, కొత్తజీవితం మొదలు పెట్లాలని, ఏమైనా, మనం చేసిన ఈ పనికి, తెలుగువాళ్ళకంటె ఎవరైనా సరే, మనల్ని ఎక్కువగా ఆదరిస్తారనుకుంటాను. అందువల్ల నే ఇక్కడ వుండకూడదనుకున్నాను. కాని, ఇంకా ఇక్కడే వున్నాం!

మూర్తి: (నిట్టూర్చి) నిజం...(ఒక క్షణం ఆగి, సిగరెట్ కాలుద్దామని) నీకేమి అభ్యతరం లేదుకదా!

జానకి: (విసుగ్గా, తీక్షణంగా) అబ్బ! నిత్యాగ్నిహోత్రం లేంది ఈ మగవాళ్ళు క్షణం నిలవలేరు కాబోలు. భోజనం చెయ్యబోతూ కూడా – ఒక క్షణం కూడా పొగలేని గాలి పీల్చలేరల్లే వుంది.

మూర్తి: క్షమించు జానీ! (సిగరెట్, కేసులో పెట్టి జానకికి పక్కగా వచ్చి కూర్చుంటాడు) అలా వున్నావేం, జానీ?

జానకి: కొంచెం నీరసంగా వుంది.

మూర్తి: ఛా! నా జానీ పరిస్థితులకు భయపడుతుందా?....ఇదేకమలైతేనే?

జానకి: (శాంతంగా) రాం! మన సంభాషణల్లో నీ భార్య ప్రసక్తి తీసుకురాకపోవడం బావుంటుందేమో!

మూర్తి: ఓ!...అవునవును...అదే మంచిది.

జానకి: (తనలో తాను అనుకుంటున్నట్లుగా) అదీ నిజమే! ఇటువంటి పరిస్థితుల్లో మేం - ఆడవాళ్ళం - అందరం ఒకటే.

మూర్తి: అబ్బే! నా వుద్దేశ్యం అది కాదు.......(ఆమెను దగ్గరకు తీసుకుని) డియర్!

జానకి: ఏం? నేను కొత్తమనిషిలా కనిపిస్తున్నానా?

మూర్తి: ఏం మాటలు జానీ?

జానకి: నేను యిదివరకు లేకపోయినా, నన్ను ఎప్పటి మాదిరిగానే ప్రేమిస్తావ్ కదూ?

(దానికి సమాధానంగా ఆమె చేతుల్ని అందుకుని ముద్దు పెట్టుకోబోతాడు)

జానకి: (వారిస్తూ) నువ్వు సిగరెట్ తాగబోతున్నావ్ రాం! (కేస్‌లోనుంచి సిగరెట్ తీసి అందిస్తుంది) నేను వెలిగిస్తాను. నిప్పుపెట్టె?

మూర్తి: (జేబులు చూసుకుని) అరె! నా సామన్లలో వుండిపోయింది!

(ఇంతలో అవసరం వచ్చినప్పుడల్లా రావడానికి అలవాటుపడ్డ బట్లర్ వస్తాడు)

బట్లర్: నిప్పుపెట్టె సార్! (జానకి కివ్వబోతాడు. మూర్తి అందుకోబోతాడు. కాని బట్లర్ దాన్ని జానకికే యిస్తాడు. ఇద్దరూ నిశ్చేష్టులౌతారు)

జానకి: సరే!

మూర్తి: (బట్లర్ వంక కోపంగా చూస్తూ) థాంక్స్.

(జానకి దగ్గరకు వెళ్లి స్వయంగా సిగరెట్ వెలిగించుకుంటూ వుండగా బట్లర్ వెళ్ళిపోతాడు)

మూర్తి: వీడెక్కడ దాపురించాడు?

జానకి: (నవ్వుతూ) అతని తప్పేముంది? నేను నీ భార్య ననుకుంటున్నాడు. భార్యలు భర్తల సిగరెట్లు వెలిగించడం కొత్తకాదు కదా!

మూర్తి: అదీ నిజమే! ఈ చోటు చాలా కొత్తగా, వింతగా కనిపిస్తోంది కదూ?

జానకి: ఏం? నీకిప్పుడనిపించిందా?

మూర్తి: నా పేరు తెలియకుండానే, నా వుద్యోగం తెలుసునంటాడు; వీడి వుద్దేశ్యం యేమిటో?

జానకి: (సహజంగా) బహుశా నీ మొహం చూసి చెప్పివుంటాడు.

మూర్తి: నా మొహంలో ఏముంది?

జానకి: అబ్బే! కోతులాడడం లేదులే! తమాషాకన్నాను...అంతే (ఒక్క క్షణం నిశ్శబ్దం)

మూర్తి: ఈ హోటల్‌లో ఒక్కటే టేబుల్ వుంది!

జానకి: (వ్యంగ్యంగా) అది కూడా ముగ్గురికి! కాని వాళ్ళేమో మనం చూస్తామని అనుకుని వుండరాయె!

మూర్తి: (తప్పుగా అర్థం చేసుని, తనకొక బెడద తప్పిన సంతోషంతో) నిజమే!..హోటళ్ళలో యిదో కొత్తపద్ధతేమో! పల్లెటూళ్ళలో, యిళ్ళలోనే హోటళ్ళు వుంటాయని కాబోలు విన్నాను...అన్నట్లు, నువ్వేం తీసుకుంటావ్?

(బట్లర్ వస్తాడు...మళ్ళీ ఇద్దరూ నిర్ఘాంతపోతాడు)

బట్లర్: భోజనం తెమ్మంటే తెద్దును సార్...పండ్లు, ఫలహారాలు అన్నీ మస్తుగ వున్నయ్.........మీకేం యిష్టమో చెబితే -

(అతని వంక యిద్దరూ ఆశ్చర్యంతో చూస్తూ వుంటారు)

చెప్పడం మరచాను సార్.....వేదాంతంగారు మరో రెండు నిమిషాల్లో వస్తురు. మిమ్మల్ని స్వయంగా రిసీవు చెయ్యలేకపోయినందుకు ఎక్స్‌క్యూస్ అడిగిరి సార్!

మూర్తి: ఎవరు? వేదాంతంగారా! ఈ విశాల విశ్వంలో వేదాంతంగారెవరో ఎప్పుడూ వినలేదే!

జానకి: నీకూ తెలియదా? తమాషాగా వుందే!

మూర్తి: (జానకి అనుమానిస్తున్నట్లుగా తెలుసుకున్నాడు) చూడు మిస్టర్! ఇది హోటలేనా? లేక పొరపాటున మేం ఎవరింటికేనా వచ్చామా?

బట్లర్: చెబితిని గద సార్! ఇది ఒకరకం హోటల్‌దా అని! మీకు ఏమీ ఇబ్బంది వుండదు సార్! (వెళ్ళబోతూ తిరిగివచ్చి) ఇంతకూ మీకేం కావలో చెప్పలేదు, సార్!

జానకి: నేనిప్పుడు భోజనం చెయ్యలేను.

మూర్తి: (నీరసంగా) నా పరిస్థితి అలానే వుంది....టిఫిన్ తీసుకుంటే సరి! (బట్లర్‌తో) ఏం? ఏమున్నయ్యోయ్?

బట్లర్: మీకేం కావాలంటే, అవి వున్నయ్ సార్! ఇడ్లీ, సాంబార్, పూరీ పొటాటో, అట్టు, వుప్మా.....

మూర్తి: సరె! రెండు ప్లేట్లు పూరీ, పొటాటో – (జానకి వంక చూస్తాడు) ఆమె తల త్రిప్పి తన అంగీకారం తెలియచేస్తుంది)

బట్లర్: నిముషంలో తెద్దును సార్. (వెళ్లిపోతాడు)

జానకి: (కూర్చుంటూ) చాలా తమాషా మనిషి!

మూర్తి: (లేస్తూ) చూడు జానీ! దీని అంతు ఏమిటో తెలుసుకు వస్తాను!

జానకి: అంత తొందర ఎందుకు? రెండు నిమిషాల్లో ఆ వేదాంతంగారెవరో స్వయంగా వస్తారు కదా!

మూర్తి: నిజమే! కాని వేదాంతంగారు ఎవరు అని?

జానకి: రాం! నీకు కావలనుకున్నప్పుడు చాలా తమాషా అయిన నాటకాలు సృష్టించగలవు! అవన్నీ బాగానే వుంటయ్. కాని యిప్పుడా! మనం ముందు ఈ ప్రాంతాలు వదలాలి. అటువంటప్పుడు అర్థం లేని వేదాంతంగారు – ఇదంతా ఎందుకు? ఇటువంటి తమాషాలు మన జీవితం కొన్నాళ్ళు సాగిన తర్వాత మొదలు పెడితే బావుంటుంది. అప్పటికి మనం ఒకళ్ళను ఒకళ్ళం బాగా అర్థం చేసుకుంటాం.

మూర్తి: ఏమిటి జానీ నువ్వంటున్నది? ఇదంతా నేను కావాలనే చేశాననా?

జానకి: ఏమో? మొత్తానికి ఎవరో చేశారు – కావాలనే! –

బట్లర్: (వచ్చి) వేదాంతంగారు సార్!

(వేదాంతం గారు వస్తాడు. మనిషి యువకుడూ కాదు, ముసలివాడూ కాదు. ప్రతిమాటా తూచి తూచి మాట్లాడతాడు...ఎప్పుడూ నవ్వే ముఖం.....కాని నవ్వినప్పుడు కొంటెతనం కనిపిస్తుంది)

వేదాం: నమస్తే.

జానకి: నమస్కారం....

మూర్తి: నమస్తే.........ఆ........

వేదాం: మిమ్మల్ని నా యింటికి ఆహ్వానించినందుకు క్షమించండి. కాని ఇది ఎన్నో కష్టాలనుంచి మిమ్మల్ని కాపాడింది. ఆ! నా పేరు తెలుసు కదా! వేదాంతం అంటారు. అసలు పేరు ఏదైతేనేం? 'పేరులోన నేమి పెన్నిధి యున్నది?' అన్నాడు గిరీశం. మనం మాట్లాడుకోవడానికి పేర్లు అవసరమేననుకోండి

అయినా –

మూర్తి: క్షమించండి...(ఏదో చెప్పబోతాడు)

వేదాం: అయినా మీరు చెప్పబోతున్నట్లుగా మనం ఒకళ్ళనొకళ్ళం ఏదో ఒక పేరుతో పిలుచుకోవాలిగద? (ఆలోచిస్తూ) మిమ్మల్ని నేను 'రాం' అని పిలవవచ్చు – ఎక్కువ చనువు తీసుకుంటున్నానా? కాని 'రాం' అనేది ఆడవాళ్ళు పిలవలసిన పేరు......నేను 'మూర్తిగారు' అంటాను. (వయ్యారంగా జానకి వంక చూసి నవ్వుతూ) ఏమంటారు!

జానకి: ఇది కలకాదు కదా!

వేదాం: (మూర్తి వైపు చూడకుండా) కాని మూర్తిగారు ఏమి ఆశ్చర్యపడడం లేదు. 'నుదుటన్ వ్రాసిన వ్రాత తప్పతరమా?' అనుకుంటూ బ్రహ్మ రాసిన రాతను చూసకుంటున్నాను.

(ఇంతవరకు అదే పని చేస్తున్న మూర్తి బిత్తరపోయి, ఆ పని చెయ్యడం ఆపేస్తాడు)

మూర్తి: జరిగినతంవరకు చాలు వేదాంతగారు! మీరు నిజంగా పిచ్చివాళ్ళు కాకపోతే మీరాడే యీ నాటకానికి ముందు జరవాడు చెప్పండి.

వేదాం: అంత కోపమైతే ఎలా మూర్తిగారూ! ఈ పరిస్థితుల్లో జరిగిన దానికి జవాబు చెప్పవలసిన బాధ్యత నా మీద వున్నదని అందరికీ తెలుసు...కాని స్నేహంతో చెప్పే జవాబు, స్నేహంతో యిచ్చే ఆతిథ్యం తరువాత చెప్పకూడదా?

మూర్తి: మేము మీ అతిథలమా?

వేదాం: ఏం? కాకూడదా?

జానకి: (ఒప్పుకుంటూ) సరే!

వేదాం: థాంక్స్......కాని ఈ పేర్ల తతంగం అలానే వుంది. వీరి పేరు తేలిపోయింది. కదా! (అంటూ జానకి వంక చూస్తాడు)

జానకి: నా పేరు జానకి.

వేదాం: అయితే కుమారి జానకి –

మూర్తి: (త్వరగా, అసహ్యంగా) ఆ.....నా భార్య!

వేదాం: అయితే నేను 'కుమారి'ని వదిలివెయ్యాలన్నమాట!

మూర్తి: (కొంచెం తత్తరపాటుతో) చూడండి –

వేదాం: (అటూ ఇటూ చూసి) కాని, తీరా చేస్తే, ఏమీ వుండదు మూర్తిగారూ!

(బట్లర్ వస్తాడు)

సరే! మనం భోజనాలు చేద్దామా?

జానకి: నేను భోజనం చెయ్యనండి (మూర్తి ఆమెవైపు చూస్తాడు) నాకు ఆకలిగా లేదు.

వేదాం: మీ ఇష్టం....అవును, పూరిపోటాటో తెప్పించమన్నారు కదా! (బట్లర్ వెడతాడు)

మీరక్కడ కూర్చోండి జానకీదేవీ! ఆ! మీరక్కడ కూర్చుంటారా మూర్తిగారూ!

(ఇద్దరికి మధ్యగా వేదాంతంగారు. ఇక చెయ్యగలిగిందేమీ లేదని విసుగ్గా కూర్చుంటాడు మూర్తి. ఇంతలో ప్లేట్లతో సహా బట్లర్ వస్తాడు. జానకి, వేదాంతం తినడం మొదలుపెడతారు. మూర్తి ఒక్క క్షణం

ముట్టుకోడు.)

వేదాం: మీరు తినరేం మూర్తిగారూ! మనిషి బ్రతకడం కోసమైనా ఏదో ఒకటి తినాలి కదా! అందులోనూ ప్రయాణం చేస్తున్న వాళ్ళు ఇంకా ఎక్కువ తినాలి. చూస్తే ఈ మీ ప్రయాణం సుఖంగా అంతకావడం మీకు ఇష్టం లేదల్లే వుంది.

మూర్తి: అంతందాకా ఎక్కడ? నాకు మొదలే అర్థం కావడం లేదు వేదాంతంగారూ! మీరు క్షమిస్తే – ఇందులో మీ ప్రసక్తి ఏముంది? అసలు మీరెవరు?

జానకి: ఆతిథ్యం ఇచ్చినవాళ్ళను అలా అడగవచ్చా, రాం?

మూర్తి: నిజమే, జానీ! అలాగయితే ఇక్కడికెలా వచ్చాం? రాముడు ఇది హోటలని చెప్పాడు. ఆ బట్లర్ కూడా ఇది 'ఒక రకం' హోటలని ఒప్పుకున్నాడు. కాని తీరా చూస్తే ఇది స్వంత యిల్లు. అదీ కాకుండా, మేం వస్తామని మీకు ముందే తెలిసినట్లుగా వుంది. నిజం చెబుతున్నాను. నాకిదేమీ అర్థం కావడం లేదు.

వేదాం: మీ బాధయేమిటో నా కర్థమయింది మూర్తిగారూ!

మూర్తి: ఏమీ తెలియని కొత్తవాళ్ళ చేత 'మూర్తిగారు' అని పేరుపెట్టి పిలిపించుకోవడం నాకు యిష్టమూ కాదు, అలవాటూ లేదు.

వేదాం: చూడండి..మీలో మీరనుకుంటున్నారు, ఈ వేదాంతం యోవరు? ఈయన మనకు తెలుసా? అసలీయనిది ఉత్తర దేశమా, దక్షిణ దేశమా?.....

జానకి: (తాపీగా) ఏ దేశమయితేనేం?

వేదాం: (ఆవిడ వంకకు తిరిగి) మీకు పూరీ బాగున్నట్లుగా వుంది....చూస్తే, మూర్తిగారి కది నచ్చినట్లు కనిపించడం లేదు.

మూర్తి: (వాటి వంకనే చూస్తూ) ఈ పూరీల్లో తప్పుపట్టడానికకేమీ కనిపించడం లేదు. మీ వంట మనిషి భీముడులా వున్నాడు.

వేదాం: థాంక్స్.....(బట్లర్ వస్తాడు) చూడు లోకనాథం! అయ్యగారు రుచిచూడకుండానే పూరీలు బావున్నాయన్నారని భీముడితో చెప్పు.

బట్లర్: నిండా థాంక్స్ సార్......చెప్పి వస్తును (వెడతాడు)

జానకి: మీ అన్ని జవాబులతోపాటు ఈ ప్రశ్నకు కూడా జవాబు చెప్పండి –

వేదాం: ఏమిటది?

జానకి: మీ బట్లర్ కావలసినటప్పుడల్లా ఎలా ప్రత్యక్షమవుతాడు? దేవుడిలా?

వేదాం: (జేబులో కాగితం తీసి) నేను ఆ ప్రశ్న రాసుకుంటాను....బట్లర్......ప్రత్యక్షం –

(బట్లర్ వస్తాడు. అతిథులు ఆశ్చర్యపోతారు)

వేదాం: లోకనాథం! పాలు – (బట్లర్ వెడతాడు)

మూర్తి: (త్వరగా పూరీతిని, కుర్చీలో నుంచి లేస్తూ) మేం ఇప్పుడే వెళ్ళిపోవాలి వేదాంతంగారూ! మీ ఆతిథ్యానికి మా హృదయపూర్వకమైన కృతజ్ఞత...హైదరాబావు మాకు ఎక్కువదూరంలో లేదనుకుంటాను.

వేదాం: నిజమే! మీరు హైదారబాదు రోడ్డుకు దగ్గరలోనే వున్నారు.

మూర్తి: మీరు మా రాముడికి సరైన దోవ చెబితే –

(ఇంతో బట్లర్ రాగానే ఆపుతాడు)

వేదాం: లోకనాథం! పాపం, మూర్తిగారికి బాగా ఆకలిగా వుందట! గ్లాసునిండా పాలుపొయ్.

బట్లర్: దానకేమి సార్! ఎన్ని తాగినా తాగవచ్చును. మస్తుగ వున్నయ్.

వేదాం: అవి కొంచెం చల్లారేలోపు ఆ సోఫాసరిచెయ్.....పాపం, మూర్తిగారు ఆ కుర్చీలో కూర్చోలేకుండా వున్నారు (బట్లర్ సర్దుతాడు. వేదాంతం గ్లాసు తీసుకుని) రాత్రిళ్ళు ఇది చాలా బలమైన ఆహారం. (జానకి వైపు తిరిగి) ఏమంటారు?

జానకి: నాకిది చాలా ఇష్టం.

వేదాం: చాలా సంతోషం (గ్లాసులోకి చూస్తూ) ఏమిటిది లోకనాథం?

బట్లర్: పాలల్లో కొంచెం సేమియాదా వేసిరి!

వేదాం: ఈ సేమియా చూశారా! మొన్న సుమిత్రాకు వెళ్ళినప్పుడు స్వయంగా తెచ్చాను వీటిని!

(బట్లర్ వెడతాడు. ఈ అవకాశం కోసమే చూస్తున్న మూర్తి కుర్చీలోనుంచి లేస్తాడు విసుగ్గా)

వేదాం: ఆ సోఫాలో కూర్చుంటారా?

మూర్తి: చూడండి వేదాంతంగారు! జరిగినంతవరకు ఈ తమాషా చాలు. మా అనుమానాలకు మీరు జవాబు చెప్పకపోతే మేం ఇక్కడ పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టం.

(జానకి ఆశ్చర్యంగా అతని వంక చూస్తుంది)

మూర్తి: ఇప్పుడు మీరా జవాబు చెప్పనైనా చెప్పాలి – జానీ! లేకపోతే మా దోవన మేం పోతాం.

వేదాం: (ఆలోచనగా) కాని, ఏది మీ దోవ?

మూర్తి: హైదరాబావు...మా జవాను కొంచెం దోవ తప్పి వుంటాడు. మమ్మల్ని మళ్ళీ హైదరాబాదు మార్గానికి చేరుస్తే –

వేదాం: (తనలో తాను మాట్లాడుకుంటున్నట్లుగా) హైదరాబాదు మార్గం! చాలా కష్టమైన మార్గం మూర్తిగారు! అదీ కాకుండా మీరు రాత్రి పూట ప్రయాణం చేస్తున్నారు.

మూర్తి: ఆ భయం మాకులేదు.

జానకి: (మూర్తికి దగ్గరగా వెళ్ళికూర్చుని, వేదాంతం గారితో) అంటే, మీ వుద్దేశ్యం?

వేదాం: (ఆమెతో) అది మీకు చాలా కొత్త దోవ – కొత్తదీ, ఇది వరకెప్పుడూ ప్రయాణం చెయ్యనిది!

మూర్తి: అదేమిటి! ఆమె చాలాసార్లు ఈ రోడ్డుమీద ప్రయాణం చేసింది. (జానకితో) అవునా జానీ!

జానకి: (తల తిప్పుతూ) నిజనికి నేనెప్పుడూ ప్రయాణం చెయ్యలేదు...కాని నాకేమీ భయం లేదు వేదాంతం గారూ!

(మూర్తి బిక్క చచ్చిపోతాడు. ఒక్క క్షణం నిశ్శబ్దం)

వేదాం: (సిగరెట్ తీసుకుని) మీకేమీ అభ్యంతరం లేదుకదా!

జానకి: అబ్బే!

(సిగరెట్ ఆఫర్ చేస్తాడు మూర్తికి)

మూర్తి: అక్కర్లేదు....

వేదాం: చాలా మంచిరకమండి లండన్ నుంచి తెప్పించాను.

మూర్తి: (తీసుకుంటూ) సరే! థాంక్స్!

వేదాం: (వారికి దగ్గరగా వున్న కుర్చీలోకి వెడుతూ) మీకక్కడ సుఖంగా వుందా మూర్తిగారూ?

మూర్తి: (సాధ్యమైనంత గంభీరంగా) మీ జవాబులు?

వేదాం: మీ ప్రశ్నలు?

జానకి: ముందు నా ప్రశ్నలకు జవాబులు చెప్పండి.. (వేదాంతం ప్రశ్నార్థకంగా ఆమెవైపు చూస్తాడు) ఈ టేబుల్ చుట్టూ మూడు కుర్చీలున్నాయ్. ఒకటి మీకనుకుందాం.....మిగిలిన రెండూ?

వేదాం: మీ కోసం, మూర్తిగారి కోసం.

జానకి: అంటే, మేం వస్తామని మీకు ముందుగానే తెలుసునన్నమాట!

వేదాం: మిమ్మల్ని యిక్కడికే తీసుకురమ్మని రాముడికి ముందుగానే చెప్పివుంచాను.

మూర్తి: (కుర్చీలోనుంచి లేవడానికి ప్రయత్నం చేస్తూ) రాముడు! నా జవాను!! మీరు చెప్పేది –

వేదాం: మీరు చెప్పేదేమిటో నిదానంగా కూర్చొని చెప్పండి (నిదానంగా కూర్చున్నాడు మూర్తి)

మూర్తి: మమ్మల్ని యిక్కడకు తీసుకురావడానికి రాముడికి మీరు లంచం ఇచ్చారన్నమాట!

వేదాం: లేదు మూర్తిగారూ! రాముడు మా మనిషి. వాడికి మీరే ఎక్కువ జీతం అన్న లంచం ఇచ్చి మీ జవానుగా వుంచుకున్నారు.

మూర్తి: (నమ్మలేక) అంటే –

జానకి: అసలు రాముడెవరు?

వేదాం: సాక్షాత్తు సీత మొగుడు – అంటే మా తోటమాలి తమ్ముడు. సీత మా పనిమనిషి.

మూర్తి: (కోపాన్ని అణుచుకుంటూ, లేవబోయి, మళ్లీ వేదాంతం సంజ్ఞ చెయ్యగానే కూర్చుని) మీరిలా నా స్వంత విషయాల్లో జోక్యం కలిగించుకోవడం యేమైనా బావుందా? చెప్పండి..

జానకి: ముందు ఈ సందేశం తీర్చండి..రాముడు మీరు పంపిన మనిషే కావచ్చు...కాని మేమంటే మీరు ఎందుకింత ఉత్సాహం చూపుతున్నారు? మీరెవరు?

వేదాం: (నవ్వుతూ) వట్టి వేదాంతాన్నే! ఇది వ్యక్తిగతమైన ఉత్సాహం కాదు. మీరు హైదరాబాదు రోడ్డు మీద పోతున్నారని, ఆ రోడ్డు మీద పద్దెనిమిదేళ్ళ పిల్ల ప్రయాణం చెయ్యడం మంచిది కాదని – నేనీ పని చేశాను.

జానకి: (మెల్లగా, కాని గర్వంతో) కాని, నా విషయంలో యీ విధమైన ఉత్సాహం, జాగ్రత్త తీసుకోమని మిమ్మల్ని కోరలేదే?

వేదాం: నిజమే! కాని, నాకు మాత్రం చాలా ఉత్సాహం. ఇట్లా ఈ రోడ్డుమీద ప్రయాణం చేసేవాళ్ళందరితోను యీ ఉత్సాహం పంచుకుంటాడు...అది నా సరదా!

మూర్తి: (ఇంతవరకు కోపాన్ని ఆపుకున్నాడు. ఇక ఉండబట్టలేక, జానకికి 'యిక్కడ నుంచి వెడదాం' అన్నట్లుగా సంజ్ఞచేస్తూ) జానీ! (అంటూ రోడ్డుమీదకు వున్న వాకిలి దగ్గరకు వెడతాడు)

వేదాం: ఆ తలుపు తాళం వేసి వుంది మూర్తిగారూ!

మూర్తి: (వేదాంతం దగ్గరకు గబగబా వచ్చి) ఐతే ఓ క్షణంలో అది తీయించండి.

(ఈ మాటలంటూ వుండగా బట్లర్ వస్తాడు)

వేదాం: లోకనాథం! మూర్తిగారు నాకు దగ్గరగా వచ్చి ఏదో చెబుతున్నారు, విన్నావా?

(మూర్తి నీరసపడి, కుర్చీలో కూలబడతాడు)

వేదాం: ద్రాక్ష తెచ్చావా ఏమిటి?

జానకి: నాకక్కరలేదు.

మూర్తి: నాకూ అక్కరలేదు.

వేదాం: సరే! నాకూ అక్కరలేదు.

(బట్లర్ పోతాడు)

వేదాం: లోకనాథం! ఈ సాయంకాలం హాస్పటల్కు వెళ్ళొచ్చావా?

బట్లర్: చిత్తం సార్! ఆ అయ్యగారు నిండా ఆరోగ్యంగా వున్నారు...యీ రోజు కొంచెం రొట్టె, పాలూ తీసుకుంటారని నర్సు చెప్పింది.

వేదాం: సరే! (బట్లర్ వెడతాడు) అతను ఓ కుఱ్ఱాడు ఇంకా చదువుసాంతం పూర్తయిందో లేదో! అతను ఓ అమ్మాయితో పారిపోతున్నాడు. అరె! ఆవిడ పేరు మరిచిపోయానే!..నాకు చాలా మతిమరుపండీ!..అతను ఆవిణ్ణి 'పుస్సీ' అనో, 'టైగర్' అనో పిలిచేవాడని జ్ఞాపకం.....(మూర్తి కోపంగా ఆయన వంక చూస్తాడు..అదేమీ పట్టించుకోకుండా, ఏదో చెప్పబోయి, జేబులో కాగితం తీస్తాడు) అరె! ఏమిటిది బట్లర్....ప్రత్యక్షం..ఓ! (జానకి వైపు తిరిగి) ఇది నా పిచ్చి అనండి, ఎక్కడ చూసినా, టేబుల్ మీద, నేలమీద, కుర్చీల్లో, అన్ని చోట్లా గంటలున్నయ్. ఇటువంటి సాయంకాలాలు మా పని మనుషులందరూ నా పిలుపందే దూరంలోనే వుంటారు.

జానకి: అంటే, మేం కొంచెం జాగ్రత్తగా వుండాలన్న హెచ్చరికన్నమాట!

వేదాం: నిజమే! ఆ విషయం మీకు చెప్పడమే మంచిదనుకున్నాను....మూర్తిగారు చాలా కోపంతో కూడా వున్నారు. మా తోటమాలి వాడి యిద్దరి తమ్ములూ, బట్లర్ – అందరూ మంచి వస్తాదులు. (మూర్తి వైపు తిరిగి) ఈ సంగతి తెలిసివుంటే ఎందుకైనా మంచిది.

జానకి: (లేచి) చూడండి వేదాంతంగారూ! నేను తమాషాగా చెప్పడం లేదు. నా విషయం నాకు బాగా తెలుసు....మిమ్మల్ని పెద్దమనుష్యులుగా అడుగుతున్నాను. ఆ తలుపు తీయించండి.

వేదాం: అది అసంభవం అనుకుంటాను జానకీదేవీ! (జానకి మెడలు కుదించుకుని కూర్చుంటుంది)

మూర్తి: అంటే, మేం ఈ ఇంట్లో జబర్దస్తీగా ఖైదు చేయబడ్డామన్నమాట!

వేదాం: ఆ విషయాన్ని గురించి అంత రాద్ధాంతం ఎందుకు మూర్తిగారూ! ఒక స్నేహితుడి ఆహ్వానం మీద, హైదరాబాదు వెళ్ళడం కొన్నాళ్ళు వాయిదా వేశామని ఎందుకనుకోకూడదు?

మూర్తి: నేను జబర్దస్తీ అనే అంటాను.

వేదాం: అనండి. దానికేం? స్వతంత్ర్య భారతదేశంలో వాక్స్వాతంత్ర్యం సంపూర్ణంగా ఉంది. మీరన్నమాట నేనెందుకు కాదనాలి? నేనూ జబర్దస్తీ అనే అంటాను.

మూర్తి: అంటే మేం ఇక్కడ బందీ చెయ్యబడ్డామన్నమాట!

వేదాం: 'ఈ ఇంటి ఆవరణలోపల' అనండి...యీ ఆవరణ లోపల మీ యిష్టం వచ్చినట్లు వుండవచ్చు.

మూర్తి: ఒక వేళ రేపుపొద్దున్నే మా..మా ఆ...వీధి లోకి వెళ్ళాలని బయలు దేరితే మీ జవానులు ఆవిడమీద

బలవంతాన చెయ్యివేసి ఆపుతారన్నమాట!

వేదాం: మూర్తిగారూ! మీ..మీ ఆవిడ అంత పొద్దున్నే వీధిలోకి వెళ్ళాలని ఎందుకనుకుంటారు, చెప్పండి? ఇంత చలికాలం ఉదయాన్నే వీధిలో యేం పని ఉంటుంది, చెప్పండి?

మూర్తి: ఒకవేళ ఆవిడ దగ్గర్లో ఉన్న పోలిసు స్టేషనుకు వెళ్ళాలనుకోండి –

వేదాం: (జానకితో) యేం? వెడతారా?

జానకి: (చిరునవ్వుతో) వెళ్ళొచ్చా?

వేదాం: ఓ! మూర్తిగారి బుజాలు ఎక్కి నిలబడితే మీరా గోడ తేలిగ్గా దాటవచ్చు. (మూర్తికి కోపం వచ్చిందని తెలుసుకుని) జవాన్లెవరో గేటు తాళం చెవులు కూడా పారవేశారని లోకనాథం చెప్పాడు....జాగ్రత్త లేని వెధవలు–

మూర్తి: (లేవబోతాడు)

వేదాం: మీరు కొంచెంసేపు ప్రశాంతంగా కూర్చోండి.

మూర్తి: కూర్చోడానికి కూడా మీ అధికారం ఏమిటి? నేను మళ్ళీ చెబుతున్నాను. ఇది అమానుషం –

జానకి: నిజమే! కాని ఆ మాటే ఎప్పుడూ చెబుతూ కూర్చోలేం కదా! ఎట్లాగో మనం ఇక్కడికి వచ్చాం. వెళ్ళగలిగేవరకూ యిక్కడే వుండాలి. కాని నాకింకా ఆశ్చర్యంగా వుండి; వేదాంతంగారు మనంమంటే ఎందుకంత ఆపేక్ష చూపిస్తున్నారా అని!

మూర్తి: ఎట్లాగయితే నేం? నన్ను ఈ సారికి ఆప గలిగాడు. కాని ఎప్పుడూ ఇలాగే ఆపగలరనుకోకండి. నాకు జరిగిన ఈ అవమానానికి ఇంతకు ఇంత నేను ఏదోవిధంగా తీర్చుకోగలను.

వేదాం: (నిర్లక్ష్యంగా) దానికేమండీ? తప్పకుండా! మీరు నా పేర వరంగల్‌కు రాసే ప్రతి వుత్తరం నాకు తప్పకుండా అందుతుంది. మీరు చేసుకునే ప్రయత్నాలు మీరు నిరభ్యంతరంగా చేసుకోవచ్చు.

మూర్తి: నాకు.....ఆ....నా భార్యకూ, నాకూ జరిగిన యీ అవమానం –

వేదాం: (త్వరగా) కాదు, కాదు......మీ భార్య కాదు.

మూర్తి: (కోపమూ వచ్చింది, నిశ్చేష్టుడూ అయినాడు) ఏమిటీ?

వేదాం: అవును. నేను చెప్పింది పొరపాటు కాదు. (జానకితో) మీరూ, ఆయనా కలిసి పారిపోతున్నారు. అవునా?

మూర్తి: (ముందుకు వచ్చి) చూడండి –

జానకి: (వారిస్తూ) ఇంకా రాద్ధాంతం ఎందుకు రాం? మనం చేస్తున్న పనికి మనం సిగ్గుపడడం లేదు కదా! నిజమే వేదాంతగారూ! మేం ఇద్దరం పారిపోతున్నాం.

వేదాం: నిజమే! ఎందుకు పారిపోకూడదు? ఈ పనికి మీరు సిగ్గుపడ్డం లేదు కదా మూర్తిగారూ?

మూర్తి: ఇట్లా నా స్వంతవిషయాల్ల జోక్యం కలిగించుకోవడం –

వేదాం: మీరు చెప్పిందంతా నిజమే! కాని అదంతా యిదివరకే చెప్పారు కదా! నేను జోక్యం కలిగించుకున్నాను – అది అర్థం లేనిదీ, అమానుషమైనదీ – నిజమే! కాని నేనిలా జోక్యం కలిగించుకోవడం మీరిద్దరూ సుఖంగా వుండాలనే!

మూర్తి: నా సుఖం నేను చూసుకోగలను.

వేదాం: (జానకిని చూపుతూ) మరి ఈమెది?

మూర్తి: నా మీద ఆమెకు నమ్మకముంది.

జానకి: నేనేమీ చిన్నపిల్లను కాను..... ఈ అపవాదు, నేను పోగొట్టుకునే మంచిపేరు, ఆ అమ్మాయి స్థితి – నేనివన్నీ ఆలోచించలేదనుకున్నారా?

వేదాం: మీరాలోచించని విషయం ఒకటి వుండి జానకీ దేవీ!

జానకి: మీరు పూర్వకాలం మనుషులు. నాకు నీతి గురించి చెప్పబోతున్నారు.

వేదాం: (ఆశ్చర్యంతో) లేదే!

జానకి: (వినిపించుకోకుండా) ఈ ఇంట్లో ఒంటరిగా, ప్రపంచాన్ని మిమ్మల్ని వేరు చేసే నాలుగు గోడల మధ్య వుంటున్నారు మీరు... పెళ్లిచేసుకున్న వాళ్ళు జీవితాంతం సుఖపడతారని పాతపురాణాలు చెప్పే మాటలు నమ్ముతున్నారు మీరు.

వేదాం: నా వుద్దేశ్యం అది కాదు.

జానకి: లేకపోతే, సుఖంగా వున్న దంపతులను విడదీసే నీచురాలినంటారు నేను.

మూర్తి: సుఖం! అది ఒక మురికిగుంట..నేను జీవితంలో నిజంగా హాయిగా వున్నది యిప్పుడే!

వేదాం: జీవితంలో నిజంగా హాయిగా వున్నది ఇప్పుడేనా?...కమలను పెళ్ళిచేసుకోబోయే నాకు కూడా యీ మాటే చెప్పారేమో?

మూర్తి: (నీరసించిపోతాడు) ఆ!

వేదాం: కూర్చోండి.

(ఒకసారి వేదాంతం వంక తీక్షణంగా చూచి, కుర్చీలో కూలబడతాడు మూర్తి)

వేదాం: మిమ్మల్ని రెండు ప్రశ్నలడుగవచ్చా?

జానకి: ఏమిటి?

వేదాం: ఆయన కమలను విడాకులిస్తారా?

మూర్తి: మాకా ప్రసక్తే అక్కర్లేదు.

వేదాం: మీకా ప్రసక్తే అక్కరలేకుండా జానకీదేవిని వివాహం చేసుకుంటారా?

మూర్తి: మరో అవమానం!....ఇహ –

వేదాం: క్షమించండి. నాకు కావలసింది సమాధానం.

జానకి: ఆయన నన్ను పెళ్ళిచేసుకుంటారు.

వేదాం: అప్పుడు, పాతపురాణాలు చెప్పినట్లుగా పెళ్లిచేసుకున్నవాళ్ళు జీవితాంతం సుఖంగా వుంటారా? (జానకి మాట్లాడదు)

మూర్తి: జానకి సుఖంకోసం నా సర్వస్వం –

వేదాం: కావచ్చు! అంతమాత్రాన – (జానకితో) నేను పాతకాలం మనిషిని. నాకు ప్రపంచం అంటే యేమిటో తెలియదు. మీరు ఈ కాలంవాళ్ళు. మీకు శాస్త్రాలన్నీ పుక్కిటి పురాణాలు....కాని ఈ పెళ్ళితరువాత జీవితాంతం సుఖంగా వుంటారా?

మూర్తి: మీరంటున్న దేమిటో నాకర్థం కావడం లేదు.

వేదాం: జానకీదేవికా తెలిసింది.

జానకి: (మెల్లగా) ఆ కష్టాలు నేను పడతాను, వేదాంత గారూ!

వేదాం: కాని చాలా కష్టాలు పడాలి..నా మాట నమ్మండి. నేను ప్రపంచానికి మీరనుకున్నంత దూరంలో లేను. అలాగే వుండివుంటే, మీ సంగతి తెలుసుకోగలిగేవాడినా?..నేను ప్రపంచాన్ని ఎరుగుదును..ఈ పెళ్ళిళ్ళలో వ్ను కష్టాలు ఎరుగుదును. అసలు వివాహం ఒక వ్యాపారం లాంటిది. (సూటిగా) కాని మీరు చేస్తున్నదేమిటి? జీవితంలో అది వరకే ఒకసారి ఈ వ్యాపారంలో చిత్తుగా ఓడిపోయిన మనిషిని పెళ్ళిచేసుకుంటున్నారు...సుఖాన్ని కొనుక్కుందామనుకుంటున్నాడు..(మూర్తితో) క్షమించండి (మళ్ళీ జానకివైపు తిరిగి) మీరు పెళ్లిచేసుకోవడానికి ఆయనలో ఘనత ఏమిటి? వివాహ జీవితంలో కొంత అనుభవం సంపాదిచారన్నదేగా? అదికూడా సుఖవంత మయినది కాదని ఆయనే చెప్పారు.

మూర్తి: (వ్యంగ్యంగా) బాగా చెప్పారు.

వేదాం: అది నిజం కాదా?

మూర్తి: కావచ్చు.........నిజం చెబుతున్నాను – సరే! కమలకు వ్యతిరేకంగా నేనేమీ చెప్పదలుచుకోలేదు.

వేదాం: చెప్పండి, చెప్పండి.......మనం జీవితాంతం పెద్దమనుష్యులంగా చెలామణి అవుదామనుకున్నా, మనం బ్రతికేదే కొద్దిరోజులు!

మూర్తి: సరే! నేను చెబుతున్నాను. భగవంతుడు కూడా మీ జీవితాన్ని సుఖమంతం చెయ్యలేదు. ఆ .... భగవంతుడు కూడా!

వేదాం: కాని మీరు ఆవిడ్నే పెళ్ళిచేసుకున్నారు కదా!

మూర్తి: నిజమే! ఆ...నిజమే. నిజమే! తరువాత?

వేదాం: (నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ) నాకు ధనం వుంది. డబ్బున్న మనుషులు మంచి వాళ్ళుకావడం చాలా అరుదు. కాని నా డబ్బు నాకే కాక, నాతోటి వాళ్ళకు కూడా వుపయోగపడి, వాళ్ళ సుఖానికి వుపయోగపడితే నాకానందం! అందువల్ల సాధ్యమయినంత వరకు సంఘంలో సుఖంలేని వివాహాలను ఆపుచేద్దామని నా ప్రయత్నం. సరదా కోసం చేస్తున్నా, డబ్బు మనషికిచ్చే విలువను, శక్తిని చూస్తే ఆశ్చర్యం వేస్తుంది.

మూర్తి: అందులో ఆశ్చర్యం ఏముంది?

వేదాం: చాలా వుంది. ఆ సంగతైనా అందరూ గ్రహించారా? గుర్తించి వుంటే ప్రతివాళ్ళూ ఒకేవిధంగా డబ్బును తగలెయ్యరు..సరే! ఈ డబ్బు యిచ్చిన శక్తిలో యిక్కడకు వచ్చిన అనేక జంటలకు – బాగా ప్రేమించుకుంటున్నాం అనుకునే వాళ్ళకు – అనేక విషమ పరిస్థితులను కలిగించి ప్రేమించుకోమన్నాను. ఆ పరీక్షలకు నిలబడితేనే ప్రేమ, పెళ్ళి....అటువంటి వాళ్ళు చాలామంది ఎవరిదారిన వాళ్ళు పోయేవాళ్ళు కొందరు పెళ్ళి చేసుకుని చాలా హాయిగా వున్నారు...ఆలోచించకుండా పెళ్ళిళ్ళకు దిగడం నాకిష్టం లేదు. అందువల్ల, మీవంటివారు ఈ రోడ్డుమీదుగా పోతువుంటే, వాళ్ళను ఆపి, "పాత పాత పురాణాలు చెప్పినట్లు, మీరు జీవితాంతం సుఖంగా వుంటారా? అని ప్రశ్నిస్తాను.

మూర్తి: మీ ఉద్దేశ్యాలు గొప్పవే......కాని మీరిలా చెప్పకుండా, చెయ్యకుండా జోక్యం కలిగించుకోవడం ఏమీ బాగాలేదు. మీకు డబ్బు యిచ్చిన శక్తినీ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నమాట!

వేదాం: అధికారమా! దీన్లో అధికారం ఏమీ లేదు. ఇక డబ్బుకున్న శక్తి అంటారా! ఇప్పుడు మీ కొక పదిలక్షల రూపాయలిచ్చి ఈ రాత్రికి మీ అవిడదగ్గరకు తిరిగి వెళ్ళమంటే, (జానకిని చూపుతూ) ఈవిడకు యిహ జీవితంలో కనిపించకుండా వుండగలరు.

మూర్తి: ఈ అసహ్యమైన విషయాలే చెబుతారా, ఈ రాత్రి అంతా?

వేదాం: అసహ్యమా? (నవ్వి) ఒక్కొక్కప్పుడు నిజం, అసహ్యంగానే వుంటుంది మరి! ఈ అసహ్యమయిన విషయాన్ని గురించే ఈ రాత్రంతా ఆలోచించండి...పదిలక్షలు! (ఒక్క క్షణం ఈ ఎరలో పడ్డట్లుగా కనిపిస్తాడు మూర్తి)

జానకి: (తిరస్కారంగా) నేను ప్రేమించిన అతను, నా ఎదుటనే మరొకరి దయాభిక్షను యాచించేటట్లు చేయడం కూడా మీ ఆదరణలో ఒక భాగం కాబోలు!

వేదాం: (నవ్వుతూ) అబ్బే! నా ఆదరణ అటువంటిదే అయితే, యిక నాకు తెలిసినంతలో పెళ్ళిళ్ళే వుండేవి కావు. సరే! నేనిప్పుడు చెప్పిన మాటల్ని ఉపసంహరించుకుంటున్నాను. మిమ్మల్ని నేను జబర్దస్తీగా విడదీయ దల్చుకోలేదు. అందుకు నాకు అధికారం కూడా లేదు.

మూర్తి: ఇంతలో ఎంత విషయం!

వేదాం: (మూర్తి వైపుకు తిరిగి) థాంక్స్.

జానకి: (నవ్వుతూ) రాం! నువ్వు అసూయపడడానికి మరోమనిషి వున్నారు. జాగ్రత్త..(వేదాంతంతో) ఏమంటారు?

వేదాం: వెరిగుడ్..యు ఆర్ స్పోర్టివ్......(గంభీరంగా) నేను చెప్పాను కదా, మీరు హైదరాబాదు వెళ్ళడానికి నాకేమీ అభ్యంతరం లేదు. కాని కొన్నాళ్ళిక్కడే వుండి మీ జీవితం ఎలా సాగుతుందో చూసుకోకూడదా?

మూర్తి: మా సంగతి మాకు తెలుసు.

వేదాం: కావచ్చు. మీ రిద్దరూ హృదయపూర్వకంగా ప్రేమించుకుని వుంటే – అటువంటి అమరమైన ప్రేమకు దేవతలు పూలవాన కురిపిస్తారు. అప్పుడు నాకంటే ఎక్కువ సంతోషించేవాళ్ళుండరు. 'మీ రిద్దరూ కలిసి హాయిగా జీవించడానికి వీలులేదు. మూర్తిగారు కమలదగ్గకే వెళ్ళిపోవాలని' నేను చెప్పడం లేదు. సుఖం లేని వివాహ జీవితాన్ని అనుభవించినవాణ్ణి నేను. అది తెలిసివుంటే – నా దగ్గర డబ్బూ, అధికారమూ వుండి కూడా సుఖంలేని పెళ్లిళ్ళు జరగడం నాకు బాధగా వుంటుంది. (కొంచెం దగ్గరగా వచ్చి) కాని జానకీదేవి! భర్తగా అప్పుడే ఒకసారి అసమర్థుణ్ణనిపించుకున్న వారిని పెళ్లిచేసుకోబోయే ముందు ఎంతో దూరం ఆలోచించాలి.

జానకి: అబ్బే! అట్లా అనడం బాగా లేదండి.

వేదాం: బాగాలేదు, నిజమే! కాని నిజం అదేకదా! ఏమంటారు మూర్తిగారూ?

మూర్తి: నేను ఇదివరకే చెప్పాను, కమలకు వ్యతిరేకంగా నేనేమీ చెప్పదలుచుకోలేదని.

వేదాం: ఆ సంగతి యిందాకటినుంచీ చెబుతూనే వున్నారు కదా! కాని జరిగిన విషయాల్లో అంతా కమలదే తప్పని నచ్చచెప్పడానికి మాత్రం ప్రయత్నించకండి.

మూర్తి: (అనుమానంతో) అయితే –

వేదాం: సంవత్సరం తరువాత తప్పంతా జానకీదేవిదే అనవచ్చు.

మూర్తి: 'సంవత్సరం తరువా' అనడంలో మీ వుద్దేశ్యం.

వేదాం: క్షమించండి....నా వుద్దేశ్యం 'తరువాత సంవత్సరం' అని.

(మూర్తి మొహం ముడుచుకుంటాడు)

జానకి: (ఆవలిస్తూ) నేనిక పడుకోవాలి. మమ్మల్నిలా ఎంతకాలం వుంచుతారు?

వేదాం: ఒక వారం రోజులుండగలరా? హాయిగా, కలిసి జీవితాన్ని గడపడానికి మీకింకా చాలా రోజులున్నాయ్ ముందు.

జానకి: మా నాన్నగారికి నేనొక వుత్తరం రాసి వచ్చాను. (విజయగర్వంతో) అది మీ ఎత్తులకు ఆటకట్లు కాదుకదా?

వేదాం: ఎంతమాత్రం కాదు. ఆ వుత్తరం మీ నాన్నగారి కందడంలో కొంచెం పొరపాటు జరిగింది. మీరు మీ స్నేహితురాలితో కొన్నాళ్ళు గడపడానికి వాల్తేరు వెళ్ళారని మీ నాన్నగారనుకుంటున్నారు...డబ్బుకున్న శక్తి! (మూర్తితో) ఏమంటారు? (మూర్తి ఏమనగలడు?

జానకి: మీరు అనుసరించే విధానాలకు నేను మిమ్మల్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. సరే! నేను పడుకుంటాను.

వేదాం: లోకనాథం! అమ్మగారు పడుకుంటారట.

బట్లర్: చిత్తం సార్...రండమ్మా (ఇద్దరూ వెడతారు)

మూర్తి: (వ్యంగ్యంగా) మీ గొప్పతనానికి నేనూ మిమ్మల్ని అభినందిస్తున్నాను.

వేదాం: ఎప్పటికయినా నిజం ఒప్పుకోక తప్పుతుందా మూర్తిగారూ?....మీరు కూడా మీ వాళ్ళకు ఉత్తరం వ్రాశారా?

మూర్తి: మీకు తెలిసే వుండాలే? మీ గూఢచారులు ఎక్కడపడితే అక్కడే వున్నారుగా! రాముడు జానకీవాళ్ళ పనిమనిషి – యింకా ఎందరో?

వేదాం: డబ్బు, మూర్తిగారూ, డబ్బు! మీకు పదిలక్షలు అసహ్యం కలిగించడం విచారించవలసిన విషయం. ఆ డబ్బుతో నన్ను శపించడానికి భగవంతుడికి కూడా లంచం ఇవ్వవచ్చు...సరే! ఒక వారం ఇక్కడ వుండడం మీకు కష్టం కాదనుకుంటాను...ఆ! చాలా కష్టపడ్డారు; కాఫీగాని, పాలుగాని కావాలా?

మూర్తి: నేను వెళ్ళేవరకు మీ ఇంట్లో పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టను.

(బట్లర్ రెండు కప్పులతో డ్రింక్ తెస్తాడు)

వేదాం: ఇంకేం! తీసుకోండి.

మూర్తి: మీ ఇంట్లో ప్రతి వస్తువుమాదిరిగానే, యిదీ మీ దౌర్జన్యం వల్లనే తీసుకుంటాను.

వేదాం: సరే! మీ బాధ నాకర్థమయింది.

మూర్తి: మీ ప్రవర్తన నీతికి విరుద్ధం –

వేదాం: (నవ్వుతూ) ఆ సోఫాలో కూర్చుని ఉపన్యాసాలివ్వండి –

మూర్తి: ఇది రాక్షసం అని బల్లగుద్ది చెబుతాను. (అని బల్ల గుద్దబోతాడు)

వేదాం: (వారిస్తూ) ఆ.....ఆ.....దెబ్బ తగులుతుంది.

(మూర్తి వేదాంతం వంక తీక్షణంగా ఒకసారి చూచి డ్రింక్ గడగడ తాగేస్తాడు)

వేదాం: సిగరెట్ కావాలా?

మూర్తి: నేను వెంటనే నిద్రపోతాను.

వేదాం: అన్నట్టు, పారిపోత్ను మరో జంట ఇక్కడేవుంది. వాళ్ళు బహుశాః యివాళో, రేపో వెడతారు. వాళ్ళను చూస్తారా?

మూర్తి: మీరు యింతవరకు చేసిన పాపాలను గురించి వినడానికి నాకు యిష్టమూ లేదు, ఓపికాలేదు.

వేదాం: సరే! రేపు వుదయం పెందలాడే కాఫీకి ఈ రూములోకి రండి.

మూర్తి: అదీ మీ దౌర్జన్యం వల్లనే –

వేదాం: ఎలాగైతేనేం, రావడం కావలసింది..గుడ్ నైట్! (బట్లర్ వస్తాడు) లోకనాథం! అయ్యగారు పడుకుంటారట!

బట్లర్: రండిసార్! (మూర్తి వేదాంతం వంక చూచి భయంగా బట్లర్‌తో వెళ్ళిపోతాడు. వేదాంతంగారు ఆ వంకకే చూసి, నవ్వి, యేదో ఆలోచిస్తు వుంటాడు)

తెర

రంగము 2

ఉదయం; హాలులో కమల, జోగారావులు కూర్చుని వుంటారు. కమల అంటే రామమూర్తి భార్య; సంసార పక్షంగా వుంటుంది. కాని జీవితంలో భర్త వల్ల పొందగల ఆనందంలో ఏ కొంచెమూ పొందలేక పోవడం వల్ల నిస్పృహ చెందిన మనిషి. జోగారావు కుర్రవాడు. నిన్న మొన్ననే చదువు పూర్తిచేసుకున్న వాడు. అనుభవం లేకపోయినా, పరిస్థితులను ఎదిరించి స్వసుఖం కోరుకునే మనిషి...అప్పుడే టిఫిన్, కాఫీ పూర్తిచేసుకొని మూతి తుడుచుకుంటూ వుంటాడు.

కమల: మరో ఇడ్లీ కావాలా?

జోగా: అక్కర్లేదు.

కమల: మరికొంచెం ఉప్మా?

రావు: నాకు తిండిదగ్గర మొహమాటం లేదు, కమలా!

కమల: కొంచెం కాఫీ –

రావు: (నిట్టూర్పుతో) అక్కర్లేదు కమలా! నేను కాఫీ తాగడం పూర్తయింది.

కమల: అతని కమల అతని కోసం యిచ్చినా అక్కర్లేదన్నమాట!

రావు: కావలసివుంటే తీసుకోనా? అందులోనూ నా కమల నా కోసం చేసియిస్తానంటే! –

కమల: (రుసరుసగా) ఇహ పనేముంది? ఆ సోఫాలో మునిగిపోవడం; తన కమలకు యిష్టం వున్నా లేకపోయినా సిగరెట్ ముట్టించడం.........అతనికి కమలకంటె సిగరెట్ యిష్టం (నవ్వి) కాదు కదా!

రావు: అవును. (లేని నవ్వు తెప్పించుకుంటాడు)

కమల: నువ్వు చెప్పింది నిజమైతే చేతిలో చెయ్యివెయ్యాలి.

రావు: (చేతిలో చెయ్యివేసూ) మరీ చిన్నపిల్ల వైపోతున్నావు కమలా!

కమల: ఇప్పుడివ్వు నీ సిగరెట్ కేసు! (దాన్ని ముద్దుపెట్టుకుని ఇందాక నీవన్నది నిజంకాదు.......ఓ! (ఆవిడ ఒక పళ్ళ పళ్లెం చూసింది)

రావు: ఏమిటి?

కమల: నువ్వు ఒక్క పండు కూడా తినలేదు కదూ!

రావు: పండా! కాయలతోనే కడుపునిండింది. ఇంకా పండెందుకు?

కమల: కాదు కాదు....నువ్వొక ఆపిల్ పండు తప్పక తినాలి.....తినకపోతే నీ కమల చాలా నొచ్చుకుంటుంది.

రావు: ఇంతవరకూ తిన్నదానికే కడుపులో చోటు లేక గొంతులోకి వస్తోంది. (కమల అతని వైపు జాలిగా చూస్తుంది) లేదు కమలా! నేను టిఫిన్ తినడం ఎప్పుడో పూర్తి చేశాను.

కమల: నేను స్వయంగా యిచ్చినా అక్కర్లేదా?

రావు: అక్కర్లేదు కమలా! మామూలుకన్నా ఎంతో ఎక్కువ తిన్నాను.

కమల: (లేస్తూ) నిజంగానా?

రావు: నీతో అబద్ధం చెప్పగలనా?...ఆ! నువ్వెక్కడ కూర్చుంటావ్?

కమల: (సోఫావైపుకు చూపుతూ) నా రావు అక్కడ, నేను అతని ప్రక్కన (అతన్ని లేవదీస్తుంది)

రావు: (నిరుత్సాహంగా) అవును.

(ఇద్దరూ సోఫాలో కూర్చుంటారు)

కమల: సిగరెట్!

రావు: థాంక్స్!.....(ఆమె ముట్టిస్తుంది) ఆ! కమలా! మనం ఇక్కడికి వచ్చి ఓ వారం రోజులయింది కదూ?

కమల: అవును. వారంరోజులు! ఎంత గొప్పగా గడిచినయ్! చివరకు యివ్వాళ యింత మంచి ఇల్లును వదిలి వెడుతున్నాం.

రావు: (అది వినిపించుకోకుండా) వారం రోజులు! మొదటిరోజు తప్ప మిగిలిన రోజులన్నీ మనం కలిసే కాఫీ, భోజనం తీసుకున్నాం కదూ!

కమల: (సంతోషంతో, ఆశ్చర్యంతో) అవును.

రావు: మనం ఆ టేబుల్ ముందు రోజుకు నాలుగు సార్లు కూర్చున్నాం – రెండుసార్లు కాఫీకి, రెండుసార్లు భోజనానికి – మొత్తం ఇరవై నాలుగుసార్లు!

కమల: ఇరవైనాలుగుసార్లు! నిజం?

రావు: మనం కూర్చున్న ప్రతి ఒక్కసారీ “ఇంకా కొంచెం తిను, ఇంకా కొంచెం తాగు” అని కనీసం నాలుగుసార్లయినా అన్నావు నువ్వు. అంటే ఏమీ అవసరం లేకుపోయినా, నన్ను రోజుకు తొంభైసార్లు, వారానికి ఏడువందల సార్లు – ‘అక్కర్లేదు కమలా’ అనేటట్లు చేశావ్కమల: (సంతోషంతో, ఆశ్చర్యంతో) అవును.

రావు: మనం

కమల: (దెబ్బతిని) రావ్!

రావు: (వెనకటిమాదిరిగానే) నాకు పాతికేళ్ళు. నీకు?

కమల: (ఆశగా) ఇరవై మూడు.

రావు: ఇరవైమూడు! అంతా సవ్యంగా జరిగితే, మనం ఇంకా యాభైఏళ్ళకి తక్కువ బ్రతకం. అంటే రెండువేల అయిదువందల వారాలు...మనం కలిసివుంటే ఈ రోజుల్లో ‘అక్కర్లేదు కమలా’ అనే మాట కనీసం పదిహేసు లక్షల సార్లు నా చేత అనిపిస్తావ్! నిజానికి ఏమీ అవసరం లేకపోయినా!

కమల: (విచారంతో) రావ్! (దుఃఖంతో ముఖం కప్పుకుంటుంది)

రావు: మనం, ఈ విషయంలో ఏదైనా సంధి కుదుర్చుకుంటే బావుంటుంది, అంతే!

కమల: ఎంత కఠినమైన మనిషివి! (జాలిగా నిట్టూరుస్తుంది)

రావు: (తెప్పరిల్లి) నా వుద్దేశ్యం విను కమలా! మనం యీ విషయాన్ని గురించి ఆలోచించుకుంటే బావుంటుందేమోనని –

కమల: (ఈ లోకంలోకి వస్తూ) రావ్!

(రావు ఈ విషయాన్ని ఎందుకు తెచ్చానా అని విచారిస్తున్నాడు. కమల నిట్టూర్పుల వంకకు దృష్టి పోనివ్వకూడదని ఎంత నిగ్రహించుకున్నా వీలుపడదు.....అవి భరించలేనివి)

రావు: (ఆమెను దగ్గరకు తీసుకుంటూ) ఊరుకో కమలా! నాది పొరపాటే! (ఇంకా నిట్టూర్పుల వేగం తగ్గదు) నా కమలే నన్ను క్షమించకపోతే నన్నీలోకంలో మరెవరు క్షమిస్తారు, చెప్పు?

కమల: (నిట్టూర్పుల మధ్య) నేను నిన్నెంతో ప్రేమిస్తున్నాను కాబట్టే, నిన్నా పండ్లు తినమన్నాను.

రావు: నిజం....నిజమే కమలా! నేనంటే నీకెంత యిష్టమో నాకు తెలియదా?

కమల: ఏ డాక్టరునైనా అడుగు. నువ్వాపళ్ళు తినాలనే అంటాడు.

రావు: అవును.

కమల: అందువల్లనే నువ్వు తినాలి.

రావు: అవును కమలా! (మళ్ళీ కమలను ఎదిరించడం ఈ జన్మలో చేతకాదు రావుకు)

కమల: (కళ్ళు తుడుచుకుంటూ) భర్తకు వంట్లో బాగుండకపోతే, జాగ్రత్తగా చూడడానికి, అతను తినకపోతే తినేటట్లు చెయ్యడానికి కాకపోతే, భార్య ఎందుకు?

రావు: అవును.......అందుకే –

కమల: మనం ఇక్కడకు వచ్చిన మర్నాడే నీకంత జలుబు చేస్తే, నిన్ను జాగ్రత్తగా చూసుకుని, మళ్ళీ కులాసాగా వుండే వుండేటట్లు చేశానా, లేదా?

రావు: నువ్వు చాలా దయగలదానివి కమలా!

కమల: దయేమీ లేదు..నిన్ను జాగ్రత్తగా కాపాడుకోవడం నాకు చాలా యిష్టం అందులోనూ జబ్బుపడ్డవాళ్ళకు సేవ చెయ్యడమంటే నాకెంతో ఇష్టం. మూర్తి ఒక్కసారి కూడా జబ్బుపడలేదు.

రావు: మూర్తి –?

కమల: మా ఆయన.

రావు: అతని పేరు మూర్తా?...సరే! నేనతన్ని ఎరుగను కాబట్టి అతన్ని గురించి నేనేమీ మాట్లాడదలుచుకోలేదు.

కమల: నిజమే రావ్! నేను కూడా అంతే!

రావు: మనం యింటినుంచి పారిపోయి వస్తున్నాం. మళ్ళీ తిరిగి వెళ్ళంకదూ?

కమల: (ఆశ్చర్యంతో) రావ్!

రావు: చూడు కమలా! మనం చాలా దూరం వచ్చాం కదూ?

కమల: అదేమిటి రావ్? నువ్వు పశ్చాత్తాప పడుతున్నావా?

రావు: (త్వరగా) లేదు, లేదు.....(ఆవిడ మళ్ళీ నిట్టూర్పులు మొదలుపెడుతుంది) లేదు కమలా, లేదు నేను

నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నప్పుడు పశ్చాత్తాపం ఎందుకు! నేను ఇప్పుదున్నంత హాయిగా ఇదివరకెప్పుడూ లేను.

కమల: (అతనికి దగ్గరగా జరిగి) రావ్! ఎంత భయపెట్టావ్! నువ్వు నిజంగా పశ్చాత్తాపపడుతున్నావు అనుకున్నాను.

రావు: పశ్చాత్తాపం ఎందుకు? నేను చాలా హాయిగా వున్నాను.

కమల: వేదాంతం గారు ఎంత నిజం చెప్పారు.

రావు: అవును. చాలా నిజం చెప్పారు.

కమల: నీతో రమ్మని నువ్వడిగినప్పుడు, మన కొకళ్ళనుగురించి ఒకళ్ళకు ఎంత తక్కువగా తెలుసు?

రావు: అవును. చాలా తక్కువ తెలుసు.

కమల: ఈ వారం రోజులలో మనం ఒకళ్ళను గురించి ఒకళ్ళం ఎంత తెలుసుకున్నాం?

రావు: అవును ఎంత తెలుసుకున్నాం?

కమల: ఇప్పుడు నాకేమీ భయం లేదు. మనం యిద్దరం కలిసి ప్రపంచం ఎదురై నిలిచినా జయించగలం ఇప్పుడు.

రావు: అవును.

(పాపం! రాజా చేసిన పాపం ఇంకా పరిహారం కాలేదు. కుడిచేతిలో సిగరెట్ వుంది. అదే చెయ్యి కమల నడుముచుట్టూ వుంది. సిగరెట్ నోట్లో పెట్టకోవడానికి చేసే ప్రయత్నాలలో రెండు మూడు సార్లు ఆమెను దగ్గరకు లాక్కోవలసి వస్తుంది. ఆమె ఆ ఆనందంలో మైమరి కళ్ళుమూసుకుంటుంది. నాలుగో ప్రయత్నంలో విజయుడైనా రావు, సిగరెట్ నోట్లో పెట్టుకుని ఒక దీర్ఘ నిశ్వాసం విడుస్తాడు. ఇంతలో వేదాంత గారు వస్తాడు)

వేదాం: నమస్తే! (వాళ్ళు దూరంగా జరుగుతారు)

రావు: నమస్తే!

వేదాం: ఆ! ఇవ్వాళ మీరీ ఇల్లు వదిలి వెడుతున్నారన్నమాట!

రావు: (ఉత్సాహం ఏమీ లేకుండా) అవును.

కమల: కాని ఇక్కడ గడిపిన ఈ వారంరోజుల్ని మాత్రం మేం జీవితంలో మరిచిపోలేం వేదాంతగారూ!

వేదాం: కొన్నాళ్ళపాటు మిమ్మల్ని ఇక్కడ వుండమన్నందుకు నన్నిప్పటికి క్షమించారన్న మాట మీరు.

కమల: (సిగ్గుపడుతూ) అవును....కాని మీరు చాలా నిజం చెప్పారు...ఆ విషయం ఇంతకు ముందే రావుతో చెప్పాను. ఆ విషయం ఇంతకు ముందే రావుతో చెప్పాను. ఏం రావ్?

రావు: అవును..ఒక్క నిముషం క్రిందటే! (గడియారం చూసుకుని) కాదు. రెండు నిముషాల క్రిందట.

వేదాం: మీకే విషయంలోనూ పొరపులు, పోట్లాటలూ లేవుకదూ?

కమల: ఒక్క విషయంలో కూడా లేవు.....అవునా రావ్?

రావు: అవును.

వేదాం: ఇంకేం......చాలా సంతోషం (గడియారం చూసుకుంటూ) మిమ్మల్ని తొందర చెయ్యను. మీ పనులన్నీ పూర్తిచేసుకోండి. కారు మరో అరగంటలో వస్తుంది.

కమల: అరె! అరగంటలోనా! నేను త్వరగా వెళ్ళాలి. (అంటూ రావువంక చూస్తుంది)

రావు: (కదలకుండా) అవును. మనం త్వరగా వెళ్ళాలి.

(కమల లేస్తుంది)

వేదాం: (కమలతో కొంచెం ముందుకు వెళ్ళి) అన్నట్లు, చూడండి కమలాదేవి! రాత్రి ఇక్కడకు మరో యిద్దరు అతిథులు వచ్చారు.

కమల: (ఆగి, ఆసక్తిగా) అంటే – మరో ప్రేమికుల జంట –

వేదాం: అవును మరో జంట –

కమల: మేం వెళ్ళేముందు ఒక్క క్షణం వాళ్ళను కలుసుకుంటే బావుండును. ఇక్కడ గడిపే వారం రోజులూ ఎంత హాయిగా, గడపవచ్చునో చెబుతాను.

వేదాం: దానికేం? మీరు తప్పకుండా కలుసుకొందురగాని.

కమల: సరే, వస్తాను (కమల వెడుతుంది)

రావు: చూడండీ?

వేదాం: ఏమిటీ?

రావు: చూడండీ.....మీరన్నది......నిజంగా, ఇప్పుడే – (గడియారం చూసుకుని, విచారంగా) అరగంట – సరే నేనూ తయారుకావాలి (బయలుదేరుతాడు)

వేదాం: రావ్ గారూ!

రావు: (వెడుతున్న వాడు ఆగి) ఆ!

వేదాం: ఒక్కమాట! (రావు వెనక్కి తిరిగి వస్తాడు. బుజం తడుతూ) హుషారుగా వుండాలండీ! అసలిటువంటి సమయంలో సంతోషంతో డాన్సు చెయ్యాలి.

రావు: (నిస్సారంగా) సంతోషమా?

(వేదాంతం నవ్వుతాడు)

సరే! నేను సామాను సర్దుకోవాలి.

(వెళ్ళిపోతున్న రావుకు బట్లర్ ఎదురు వస్తాడు. నిరుత్సాహంగా వున్న రావును చూచి వేదాంతం, బట్లర్ ఇద్దరూ నవ్వుకుంటారు)

బట్లర్: గుడ్ మార్నింగ్ సర్!

వేదాం: మర్నింగ్.....ఈ వుదయం ఎంత గొప్పగా వుందో చూశావా?

బట్లర్: చూడకేమి సార్ (కొంచెంసేపు ఆలోచించి) చూడలేదు సార్!

వేదాం: చూడలేదా! ఐతే కొంచెంసేపు ఆగు. ఎంత గొప్పగా వుండో కనిపిస్తుంది. ప్రపంచం అంటే, నాకిప్పుడు ఆశ కలుగుతోంది.

బట్లర్: నిండా నిజం సార్!

వేదాం: మనం చెయ్యగలిగినదంతా చెయ్యాలి....తెలసిందా?

బట్లర్: దానికేమి సార్! మస్తు చేస్తుము (పేపర్ యిస్తాడు)

వేదాం: ఏమిటిది.

బట్లర్: ఇవ్వాల్టి పేపరు సార్!

వేదాం: చూడు!..దీనిలో కొత్త జంటలు వున్నయ్యో? (లెక్కపెడుతూ) ఒకటి, రెండు, మూడు...పది! పది జంటలు! పాత పురాణాలు చెప్పినట్లు జీవితాంతం సుఖపడదలుచుకున్న వాళ్ళు యిరవైమంది....అన్నట్లు, మీ దొరగారేమంటున్నాడు?

బట్లర్: నిండా విచారంలో వున్నారు సార్!

వేదాం: విచారమా? ఎందుకు?

బట్లర్: ఆయన సామాను ఎక్కడో పోయింది సార్!

వేదాం: అంటే, అది ఆయనతో రాలేదా?

బట్లర్: వచ్చినట్లు లేదు సార్!

వేదాం: ఎంత అజాగ్రత్త? ఆయనకు మనం ఏమి సహాయం చెయ్యలేమా?

బట్లర్: లుంగీ, అద్దం, దువ్వెన, అన్నీ యిస్తనన్నాడు సార్ మన లింగరాజు! మూర్తిగారు నల్ల ఒప్పుకోలేదు సార్!

వేదాం: లింగరాజు సంగతి నాకు తెలియదా! చాలా మంచివాడు.

బట్లర్: టైమ్‌కు మన ఇంట్లో కూడా బ్లేడులు నిండా అయిపోయాయి సార్!...ఇన్ని చూచి అయ్యగారు డౌన్ అయిపోయారు సార్!

వేదాం: మళ్ళీ లేచి మామూలు మనిషి కావడానికి ఏం చెయ్యాలంటావ్?

బట్లర్: కడుపునిండా టిఫిన్ తింటే సరి సార్!

వేదాం: నీ సలహీ అద్భుతంగా ఉంది.....అది మూర్తిగారికి స్వయంగా అందజెయ్......

(ఇంతలో జానకి వస్తుంది. మూర్తిమీద ఆశ చాలాకొద్దిగా వుంది. ఈ గది చూచి చాలా ఆశ్చర్యపోతుంది)

వేదాం: ఓ! నమస్తే జానకిదేవీ! రాత్రి బాగా నిద్రపట్టిందా?

జానకి: మీ గదులు చాలా బావున్నాయండి.

వేదాం: థాంక్స్.

బట్లర్: టిఫిన్ తెస్తాను సార్. (వెళ్ళిపోతాడు)

వేదాం: మీరు కాఫీ తాగుతారా? పాలా?

జానకి: ఏమయితే యేం కాని, రాం యేడి?

వేదాం: రాం? ఎందుకు?

జానకి: ఇవ్వాళ మొదటి సారి అతనితో కలిసి కాఫీ తాగుదామనుకున్నాను – ప్రాక్టీస్ కోసం – అతనితో కొన్ని సంగతులు చెప్పాలి.

వేదాం: (నవ్వుతూ) పోనీ, అవి నాతోనే చెప్పండి.

జానకి: (కూర్చుంటూ) అవి భార్యభర్తలు ఏకాంతగా చెప్పుకోవలసినవి.

వేదాం: ప్రాక్టీసుకోసమే కదా! ఇట్లా చెప్పినా ప్రాక్టీసే!

జానకి: సరే!

వేదాం: థాంక్స్........(ఇంతలో మూర్తిగా మారిపోయి) ఆ! నీకేం కావాలి జానీ? ఇడ్లీ, సాంబార్, పూరీ

పొటాటో, అట్టూ, పంచదార, బోండా చట్నీ - అన్నీ ద్వంద్వాల మీద నడుస్తున్నాయి.

జానకి: అప్పుడే మరిచిపొయ్యావా?

వేదాం: లేదు లేదు ఉప్మా.

(బట్లర్ రెండు ప్లేట్లతో ఉప్మా తెచ్చిఅక్కడ పెడతాడు)

జానకి: (ఉప్మా తిని) కాఫీనా, టీనా రాం?

వేదాం: నేను కాఫీ తప్ప మరొకటి తాగనని నీకు తెలియదా, జానీ!

జానకి: మరిచిపోయాను. (బట్లర్ కాఫీ తెస్తాడు)

వేదాం: (తాగుతూ) కాఫీ చాలా బావుంది ప్రేయసీ! అరె! నాటకాల్లో భాష వస్తోందే! ఎలా వుంది?

జానకి: బాగానే వుంది.

వేదాం: ఇంతకుమందే పేపర్లో ఓ భయంకరమైన వార్త చూశాను రాణీ....రాణీ! అదెలా వుంది.

జానకి: నిజంగా జీవితంలో వుపయోగించవలసిన భాష అది...నువ్వు ఇంతవరకు పెళ్ళి చేసుకోలేదు కదూ, రాం.

వేదాం: ఇంతవరకు ఒకే ఒక్కసారి చేసుకున్నాను కమలని....కమల నీకు తెలియదా, జానీ?

జానకి: జ్ఞాపకం లేదు....నేను మిమ్మల్ని నిజంగానే 'రాం' అనుకున్నాను.

వేదాం: నన్ను గురించి ఇంతమంచిగా ఎవరు మాట్లాడతారు.

జానకి: మీవంటివాళ్ళను నేనెక్కడా చూడలేదు.

వేదాం: (మళ్ళీ మూర్తయిపోయి) అరె! సరిగ్గా కమల కూడా అట్లానే అనేది. సరె! కమలకు వ్యతిరేకంగా నేనేమీ చెప్పదలుచుకోలేదు.

జానకి: రాం! మన సంభాషణలలోకి నీ భార్య ప్రసక్తి తీసుకురావడం నాకు బావుండదు.

వేదాం: నాకూ అంతే! సరే! అసలు సంగతి చెప్పలేదు - నిన్న గుర్రపు పందాలలో మన గుర్రాలన్నీ ఓడిపోయాయ్.

జానకి: అయ్యో!

వేదాం: నేను సర్వస్వం ఓడిన ధర్మరాజునైపోయాను.....ఇక నేనేదైనా వుద్యోగం చెయ్యాలి, జానీ!

జానకి: నువ్వే వుద్యోగం చెయ్యాలో చెప్పనా? (చెప్పమన్నట్లు చూస్తాడు) నువ్వు కేంద్ర ప్రభుత్వంలో మంత్రివై పెద్ద పెద్ద వుపన్యాసాలివ్వాలి.

వేదాం: నన్నెందుకు పనికిమాలినివాడికంద కట్టాలన్నమా.

జానకి: ఏం?

వేదాం: జీవితంలో దేనికీ పనికిరానివాడు రాజకీయాల్లో చేరతాడంటారు. అందులోనూ మంత్రికావడానికి మరీ.....

జానకి: ఏమో! నాకు మాత్రం నువ్వదే కావాలి.

వేదాం: అయితే సరే! నువ్వేది కావాలంటే నేనదే అవుతాను.

జానకి: ఎంత చిలిపిగా మాట్లాడుతావ్! కొంచెం కాఫీ కావాలా?

వేదాం: నువ్వు యిస్తానంటే వద్దంటానా? మన కీమాటలతో జీవితాంతం గడుస్తుందనే నీ వుద్దేశ్యమా?

జానకి: ఏం? ఎందుకు గడవదు?

వేదాం: పాడిందే పాడుతూ, జీవితమంతా, సరే! కాఫీ తాగేటప్పుడీమాట లెందుకు? కులాసా కోసం రాత్రి నీకు వచ్చిక కల ఒకటి చెప్పు.

జానకి: (ఆలోచించి) రాత్రి నాకు చాలా తమషా కల వచ్చింది.

వేదాం: (ఆసక్తితో) ఏమిటది, జానీ?

జానకి: ఒక రాత్రి మనం పారిపోతున్నాంట! మధ్యలో దారితప్పి, ఒక యిల్లు చూసి హోటలు అనుకుని అక్కడకు వచ్చాం. కాని అది హోటలు కాదు.....వేదాంతం అనే తమాషా మనిషి వున్న తమాషా ఇల్లది.

వేదాం: చాలా తమాషాగా వుందే! వేదాంత ఎవరు? ఈ భూప్రపంచంలో ఆయన పేరెక్కడా వినలేదే!

జానకి: ఆయన మనల్ని బందీలన్నాడు. ఆ యింటి తలుపులన్నీ తాళాలు వేసి మనం బయటకు కదలకూడదన్నానాడు! ఒక వారం మనం అక్కడే వుండి, ముందు ముందు సుఖంగా వుండగలమో లేదో ప్రయత్నం చేసి చూడమన్నాడు...ఆ వారం తర్వాత మనం వెళ్ళొచ్చుట.

వేదాం: ఎంత అసంభవంగా ఉంది! సర్వ స్వతంత్ర్య భారతదేశంలో గౌరవనీయులైన మనుష్యుల్ని బందీలుగా వుంచడానికి ఆ వేదాంతగారికి హక్కేముంది?

జానకి: చాలా అసంభవంగా వుంది కదూ?

వేదాం: అసంభవం యేమిటి, హాస్యస్పదంగా ఉంది.

జానకి: (ఆ మాటల్లోని నిజాన్ని పరిశీలిద్దామని తలుపు దగ్గరకు వెళ్ళితోస్తుంది. తలుపు తీసే వుంది) నేనూ అదే అనకున్నాను. (బయటకు వెళ్ళి, వచ్చి) గేటు తలుపులు కూడా తీసేవున్నయ్! రాత్రి నాకు వచ్చిన కల ఎంత అసంభవంలా వుంది.

వేదాం: కలలకు సంభవం, అసంభవం యేమిటి?.....సరే! నాకు ఓ తమాషా కలవచ్చింది.

జానకి: ఏమిటది?

వేదాం: (ఓ క్షణం సూటిగా జానకి వంక చూసి ముఖం తిప్పుకుని) ప్రపంచానికి సంబంధం లేని ఒక యిల్లు వుంది, ఆ యింట్లో తండ్రీ, కూతురూ – యిద్దరేడ తండ్రి ముసలివాడు. తనపనేమో తనకు తప్ప యితరుల సంగతి పట్టించుకోడు. ఈ కూతురు చదువుకొంటున్నా, పరిస్థితులవల్ల, పెంపకం వల్ల ఒంటరిది. ఆమెకు సర్వస్వం పుస్తకాలు....అటు వంటి పరిస్థితుల్లో ఆవిడ జీవిత ప్రాంగణంలోకి ఓ మనిషి ప్రవేశిస్తాడు. (ఇంత వరకు చెప్పి, మరోసారి జానకి వంక చూస్తాడు. ఆమె పాలిపోయివుంది) ఏమీ ఎరుగని ఆ అమయకురాలికి, అతను దిగివచ్చిన వాడిలా కనిపిస్తాడు. చివరకు ఆమె అతనికి ఎంత కృతజ్ఞురాలైందంటే, అతనేం చెబితే అదే వేదమయింది ఆమెకు..అప్పుడు కాని చెప్పలేదతను తనకు పెళ్ళయిన విషయం....తనకూ భార్యకూ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందన్నాడు. నువ్వు నాకు సర్వస్వం అన్నాడు. ఇద్దరం కలిసి పారపోదామన్నాడు. పాపం! పిచ్చి పిల్ల!! అన్ని నమ్మింది. అతనితో వచ్చేసిందట! ఎంత అసంభవం?

జానకి: (అతనికంతా తెలుసునన్నమాట! తెల్లబోయిన మనిషి తెప్పరిల్లుకుంటుంది) చాలా అసంభవంగా వుంది. సరే! కారు ఎప్పుడు వస్తుంది వేదాంతంగారూ?

వేదాం: కారా?

జానకి: అవును...మూర్తిగారి కారు.

వేదాం: అంటే, ఈ సాహసకృత్యాన్ని కొనసాగిస్తారన్నమాట!

జానకి: అవును..ఏం?

వేదాం: ముందు మూర్తిగారు కాఫీ తీసుకోవాలి... (లేస్తూ) మరో యిరవై నిముషాల్లో!

జానకి: నేను మిమ్మల్ని మళ్ళీ కలుసుకోగలనా?

వేదాం: దానికేం? మిమ్మల్నింకా భగవంతుడికి అప్పగించవలసిన భారం నా మీద వుంది.

(ఆయన వైపు ఓ క్షణం చూసి వెళ్ళిపోతుంది జానకి. ఇంతలో బట్లర్ వస్తాడు)

వేదాం: విన్నావా లోకనాథం! మీ దొరగారు దొరసానిగారు మరో యిరవై నిమిషాల్లో వెళ్ళిపోతారట!

బట్లర్: (హేళనగా) అలాగే సార్!

వేదాం: ఇంతవరకు రిహార్సల్స బాగానే జరిగినయ్. ఇహ నాటకం మొదలు! నీ పాత్ర నువ్వు బాగా పోషిస్తావ్ కదూ?

బట్లర్: మీరు చెప్పవలెనా సార్! మనకు దీన్లో టెన్ ఇయర్స్ ఎక్స్పీరియన్స్దా!

వేదాం: వెరీగుడ్......

(బట్లర్ వెనకాలే వేదాంతం వెళ్ళిపోతాడు. ఒక క్షణం తరువాత మూర్తి వస్తాడు. నలిగిన నైట్‌డ్రెస్‌తో, దువ్వుకోని జుట్టుతో జబ్బు చేసిన మనిషిలా వుంటాడు..బల్లమీద కాఫీ కెటిల్ కనిపిస్తుంది. దగ్గరకు వచ్చి కాఫీ కప్పులో పోసుకుని ఒక గుక్కెడు తాగుతాడు. ఎవరైనా వున్నారేమోనని చుట్టూ చూసి, మరో గుక్కెడు తాగుతూ వుంటాడు)

వేదాం: హల్లో! గుడ్ మార్నింగ్ మూర్తిగారూ!

మూర్తి: (ఉలిక్కిపడి, వెనక్కు తిరిగి, కోపంతో) ఉ! ఇందాకట్నుంచీ మీరిక్కడే వున్నారన్నమాట!

వేదాం: (నవ్వుతూ) లేదండీ! ఇప్పుడే వస్తున్నాను (కూర్చుంటూ) బాగా ఆకలయినట్టుగా వుంది. ఏం?

(మూర్తి మాట్లాడడు)

రాత్రి బాగా నిద్రపట్టిందా?

మూర్తి: నిద్రా? ఆ వెధవ రూముల్లో మరో రోజు పడుకుంటే శాశ్వత నిద్రే పడుతుంది. అయితే నా సామానేమయిందండీ?

వేదాం: (ఆశ్చర్యంగా) మీ సామానా?

మూర్తి: అక్కడ వుంటే పోయిందనుకోవడం ఎందుకండీ?

వేదాం: ఈ విషయం ఏమిటో కనుక్కుందాం......(సానుభూతిగా) మూర్తిగారూ! హనీమూన్‌కు పోతూ వుండగా సామాను పోవడమంటే అపశకున మన్నమాట! అంతే! అదృష్టవంతుల్ని చెరిచేవాళ్లు లేరు...దురదృష్టవంతుల్ని బాగుచేసేవారు లేరు.

(ఒక్కొక్క మాట అన్నకొద్దీ మూర్తికి కోపం ఎక్కువవుతుంది. పళ్ళు బిగించి ఏదో చెప్పాలని లేచేసరికి, బట్లర్ వస్తాడు. మూర్తి కుర్చీలో కూలబడతాడు)

వేదాం: లోకనాథం మూర్తిగారి సామానట, ఏమయింది?

బట్లర్: ఏమయిందో కనిపించలేదని రాముడు చెప్పినాడు సార్!

వేదాం: ఆ సామాను ఆయనతో రాలేదా?

బట్లర్: రాలేదనే రాముడు చెప్పినాడు సార్.

వేదాం: చ్ఛ్! ఎంత అజాగ్రత్త! (మూర్తి వంక చూస్తూ) ఏమిటది?

మూర్తి: (చాలాసేపట్నుంచి అదే ప్రయత్నంలో వుండి హఠాత్తుగా తుమ్ముతాడు)

వేదాం: అరె! బాగా జలుబు చేసినట్టుగా వుందే! ఈ జేబురుమాలు తీసుకోండి.

మూర్తి: (తన దగ్గర లేదు కాబట్టి తీసుకోక తప్పలేదు. అందులో అతి కొత్తది కూడాను) థాంక్స్!

వేదాం: (సానుభూతిగా) నిన్న మీరు వేసుకున్న బ్రౌన్ సూటు ఏమయింది?..ఎక్కడో చూశానే! (మూర్తి తుమ్మబోతాడు) ఎక్కడంటే – (బట్లర్ వైపుకు తిరగ్గా, అతను మూర్తిని చూపుతాడు) ఎక్కడంటే (మూర్తి తుమ్ముతాడు)

మూర్తి: వాడు..ఆ ఫూల్ (మళ్ళీ అదే ప్రయత్నంలో ఆగిపోతాడు)

వేదాం: (బాధగా) ఏమిటి మీరనేది? లోకనాథం! మూర్తిగారి బ్రౌన్ సూట్ ఏమయింది?

బట్లర్: పొరపాటు సార్......అయ్యగారి లగేజి –

వేదాం: లగేజి సంగతి కాదు నేనడుతున్నది. ఆయన బ్రౌన్ సూటు – (మూర్తి తుమ్ముతాడు.) నే నేమనుకున్నానో తెలుసా? మూర్తిగారు ఎంత చక్కని సూటు వేసుకున్నారు? మనిషి బావుండకపోయినా ఈ సూటు వేసుకుంటే ఎవరైనా బావుంటారే!..అనుకున్నాను. అంటే మీరు బావుండలేదని కాదండోయ్! ఏమయిందోయ్ అది?

బట్లర్: రాముడు చిన్న పొరపాటు చేసినాడు సార్! మూర్తిగారి కోసం అది తీసుకొస్తుంటే కిందపడి కొంచెం బురదయింది సార్! మళ్ళీ బాగుచేస్తున్నాను.

వేదాం: వెధవ అజాగ్రత్త.

బట్లర్: నిజం సార్. నేనప్పుడే కోప్పడివుంటిని.

మూర్తి: కోప్పడ్డమా? వాణ్ని నిలుచున్న వాణ్ని నిలుచున్నట్లుగా కాల్చెయ్యాలి.

వేదాం: బాగా చెప్పారు.....లోకనాథం! వాణ్ణి నిలుచున్న పాటున కాల్చెయ్

బట్లర్: చిత్తం సార్.

వేదాం: ముందు మూర్తిగారి బ్రౌన్ సూట్ త్వరగా వచ్చే ఏర్పాటు చూడు.

బట్లర్: ఈసరికి అయిపోయి వుంటుంది సార్.

వేదాం: ఎక్కడా తడి ఉండకూడదు. ఇప్పటికే మూర్తిగారికి బాగా జలుబుచేసింది.

మూర్తి: (తుమ్ముతాడు)

వేదాం: బాగా జలుబు చేసిందండి! మీకు తరుచు జలుబు చేస్తుందా?

మూర్తి: నేను పుట్టిన తరువాత యింతవరకు జబ్బు చేసి ఎరగను.

వేదాం: విన్నావా, లోకనాథం! మూర్తిగారికి జబ్బు చెయ్యడం యిదే మొదలట!

బట్లర్: కావచ్చు సార్! రావుగారికి, యింకా యిద్దరు ముగ్గురుకి ఆ గదిలో పడుకోగానే జలుబు చేసిందిసార్!

మూర్తి: వెధవ గది –

వేదాం: నాకు యిదివరకే ఎందుకు చెప్పలేదు? ఇవ్వాళ రాత్రికి మూర్తిగారికి మరోగది ఏర్పాటుచెయ్.

బట్లర్: తప్పకుండా సార్! (వెళ్ళిపోతాడు)

వేదాం: (సానుభూతిగా) నాకు చాలా విచారంగా వుంది – సరే! మీకు తెలుసుగా, 'జ్వరానికి కటిక ఉపోషం, జలుబుకు కడుపుకు నైవేద్యం' అంటారు పెద్దలు.

(మూర్తి అర్థంకాక వేదాంతంగారి వంక సీరియస్‌గా చూస్తాడు)

వేదాం: అందువల్ల మీరు కడుపునిండా తినాలి.

(బట్లర్ ఉప్మా, కాఫీ తెచ్చి బల్లమీద వుంచి వెడతాడు. మూర్తి ప్లేటు తరువాత ప్లేటు తింటూ ఉండగా)

ఓ మీరివ్వాళ గడ్డం చేసుకోవాలి కదూ! మరిచిపోయాను! మీ షేవింగ్ సెట్ కూడా పోయింది కదూ!

మూర్తి: బ్రూట్స్ –

వేదాం: సరే! ఆపదలో ఒకళ్ళనొకళ్ళం సహాయం చేసుకోకపోతే ఎలా? నా రేజర్ యిస్తాలెండి.

మూర్తి: తప్పదు మరి –

వేదాం: మీరు తింటూ వుండండి...ఈలోగా నేతెస్తాను.

(వెళ్ళిపోతాడు. తింటూ వుండగా జానకి వస్తుంది)

మూర్తి: హల్లో! రా, జానీ, రా!

(అని లేవబోతాడు)

జానకి: ముందు నీ టిఫిన్ కానీ!

మూర్తి: (తుమ్మడానికి అట్టహాసం చేస్తూ వుంటాడు)

జానకి: ఏమిటది?

మూర్తి: బాగా జలుబు చేసింది...నాకు జీవితంలో జబ్బు చెయ్యడం ఇదే మొదటి సారి. దీనికి మందేమిటో తెలుసా? కడుపు నిండా తినడం – (తింటూ వుంటాడు)

జానకి: నాకు జలుబు గురించి నిజానికి ఎక్కువగా తెలియదు. అయినా జాగ్రత్తగా తిను.

మూర్తి: థాంక్స్..మరి నువ్వు?

జానకి: నేను కాఫీ తీసుకున్నాను.

మూర్తి: గుడ్......(అలా తింటూనే వుంటాడు)

జానకి: రాం! (ఒకసారి ఆమెవంక చూచి మళ్ళా తినడం మొదలుపెడతాడు) రాం! నా వంక ఒకసారి చూడు. నీతో మాట్లాడాలి.

మూర్తి: (ఇంకా తింటూనే) ఒకసారేమిటి? వంద సార్లు చూస్తాను.

జానకి: నువ్వు జాగ్రత్తగా వినాలి. ఆ తిండి ఇకనైనా మానుదూ!

మూర్తి: సారీ!..(మూర్తి ముక్కు బిగపడతాడు, తుమ్ము రాకుండా) చెప్పు......

జానకి: మరో పావుగంటలో మనకారు ఇక్కడకు వస్తుంది.

మూర్తి: ఎవరిది?

జానకి: మనదే! ఇంకా బాగా చెప్పాలంటే, నీది!

మూర్తి: సరే...ఎందుకు అని?

జానకి: (ఓర్పుతో) నువ్వూ నేనూ కలిసి ప్రయాణం చేస్తున్నాం, రాం.....బహుశః ఆ సంగతి తిండి అడుగునపడి మరిచోపోయినట్లున్నావ్! కారు మీద వరంగల్ వెడదాం. అక్కడ నుంచి రైలు మీద హైదరాబాదు....నువ్వు కాఫీ తాగిన వెంటనే –

మూర్తి: మరి వేదాంతంగారు?

జానకి: మనమిద్దరమే రాం, వెడుతున్నది.

మూర్తి: అదేమిటి జానీ! నువ్వప్పుడే మరిచిపోయావా యేమిటి, వేదాంతంగారు మనల్ని యింట్లో వుంచి తాళాలు బిగించడం?

జానకి: కలలు కనకు రాం. మరో పావుగంటలో కారు వస్తుంది.

మూర్తి: కారు వస్తుందా?

జానకి: ఎందుకు రాదు? అది నీ కారు......ఇది స్వతంత్ర్య దేశం.......అందులో ఇరవయ్యో శతాబ్దం... దారి తప్పడం వల్ల రాత్రి ఇక్కడ వున్నాం.....ఈ పూట మనదోవన మనం పోతాం.

మూర్తి: కాని, రాత్రి వేదాంతంగారు అంత అసంభవంగా మాట్లాడారు కదా?

జానకి: దాని సంగతి అలా వుంచు....త్వరగా కానీ! ఇంకా నువ్వు గడ్డం చేసుకోవాలి....గుడ్డలుర వేసుకోవాలి. (ప్రేమతో) కొంచెం కాఫీ కావాలా?

మూర్తి: (జానకి పోసిన కాఫీ తాగుతూ) కాని నేను ఈ గుడ్డల్తో ఎలా వస్తాను?

జానకి: నేను చెప్పేది అదే!

మూర్తి: అది కాదు జానీ! నా సామాను పోయింది. అదీ కాక ఇంత జలుబుతో మళ్ళీ ప్రయాణం.

జానకి: (నిస్పృహతో) స్! అడుగడుగునా ఈ హంసపాదు లేమిటి? తీరా బయలుదేరే సమయానికి నీ సామాను పోగొట్టుకున్నావా.

మూర్తి: నేను పోగొట్టుకోలేదు. అదే పోయింది.

జానకి: (కోపంగా) సామాను పోగొట్టుకున్నావ్...జలుబు పట్టించుకున్నావ్.

మూర్తి: నేను పట్టించుకోందే! అదే పట్టుకుంది.

జానకి: అయితే ఇప్పుడేం చేద్దామని?

మూర్తి: నా సామాను కనిపించగానే – ఈ జలుబు కొంచెం తగ్గితే –

జానకి: అంతవరకు ఈ వేదాంతంగారి ఆతిథ్యం స్వీకరిస్తావన్నమాట!

మూర్తి: అదీ దౌర్జన్య, నిర్బంధం వల్లనే – మనం ఇక్కడ తీసుకున్న ప్రతిదీ జ్ఞాపకం ఉంచుకుని –

జానకి: ఇది నువ్వు మూడోసారి కాఫీ తాగడం! జ్ఞాపకం ఉంచుకో!

మూర్తి: అవునవును...

జానకి: నేను పొద్దున్న ఉప్మా, కాఫీ – రాత్రి మన టిఫిన్ – ఇవన్నీ జ్ఞాపకం ఉంచుకోవడానికి ఒక పుస్తకంలో రాసి వుంచుకోడి.

మూర్తి: చూడు జానీ!

జానకి: ముందు కాఫీ తాగు.

మూర్తి: అంత కోప్పడితే ఎలా జానీ? నాకు తొడుక్కోవడానికి ఒక జత గుడ్డలన్నా లేంది, వెళ్ళడం ఎలా?

జానకి: అంటే, నువ్వు తొడుక్కున్నవి కూడా పోయాయంటావ్?

మూర్తి: అది నా తప్పు కాదు, జానీ! ....వాడెవరు.........వాడు, వాడి పేరు జ్ఞాపకం రావడంలేదే!

జానకి: అరె! ఇటువంటి వాడివి ఒక అమ్మాయిని బొంబాయి ఏం తీసుకువెడతావ్? పరిస్థితుల నెదిరించలేవు, మనుష్యులన్నంతకన్నా ఎదుర్కొనలేవు –

మూర్తి: చూడు, జానీ –

(జానకి చూడకుండానే వేదాంతగారు వస్తాడు)

వేదాం: (షేవింగ్‌సెట్, టవల్ అందిస్తూ) ఇదుగో మూర్తిగారూ!

జానకి: చూడండి వేదాంతంగారూ! మాకు కారు అవసరం లేదు.

వేదాం: ఏం?

జానకి: రామానకి ఒంట్లో బాగాలేదు. రేపటికట కులాసాగా వుంటాడేమో! అప్పటిదాకా యిక్కడే వుండాలనుకుంటాను. నాకు చాలా విచారంగా వుంది.

వేదాం: మీరిక్కడ వుండడం నాకు చాలా సంతోషమని ముందే చెప్పాను కదా!

జానకి: సరే, వస్తాను..(ఏదో పని వున్నదానిలా వెళ్ళిపోతుంది)

వేదాం: ఊ! కానివ్వండి.

మూర్తి: థాంక్స్......(సామానులు పట్టుకుని లేస్తాడు)

వేదాం: ఎక్కడికి?

మూర్తి: వసారాలోకి

వేదాం: అరె! ఈ చలికాలం వుదయం వసారాలోకి వెడతారా? అందులోనూ యింత జలుబుతో.

మూర్తి: ఇక్కడెట్లా చేసుకుంటానండీ.

వేదాం: ఫరవాలేదండీ! మీ కిదివరకెప్పుడూ జలుబు చెయ్యలేదల్లే వుంది......

మూర్తి: సరే!

వేదాం: మీకేమైనా కావాలంటే అడగడానికి మొహమాట పడకండి......(వెళ్ళిపోతాడు) (మూర్తిగడ్డం చేసుకుంటూ వుండగా రావు వస్తాడు)

రావు: హల్లో!

మూర్తి: (చుట్టూ చూస్తూ) హల్లో!

రావు: స్వంత క్షౌరం అన్నమాట?

మూర్తి: (తెలియనివాడు, అంతచొరవ చేసుకొనే సరికి, కోపం వచ్చి) కనిపించడంలా?

(మూర్తిగట్టిగా తుమ్ముతాడు)

రావు: అరె! జలుబు కూడా చేసిందా?

మూర్తి: ఆ!

రావు: చ్చ్! చలికాలంలో జలుబా?

మూర్తి: ఏమండోయ్! మిమ్మల్ని నేనిక్కడకు రమ్మనలేదు. మీరు నన్ను గురించి ఏమీ విమర్శలు చేయనక్కరలేదు.

రావు: ఆ మాటకొస్తే ఈ హాలులోకి నేను ముందు వచ్చాను. మీరిక్కడ గడ్డం చేసుకోవడానికి వీలు లేదు.

మూర్తి: దానికి చాలా కారణాలున్నాయ్.

రావు: మీరా కారణాలు చెప్పడానికి శ్రమపడకండి. నాకవి ఇదివరకే తెలుసు.

మూర్తి: ఎట్లా తెలుసు?

రావు: మీరేనా రాత్రి వచ్చిన అతిథులు?

మూర్తి: అవును (ఆలోచించి) ఇవ్వాళ వెళ్ళిపోతున్నది మీరునన్నమాట!

రావు: అవును.

మూర్తి: మీకు తెలిసిన కారణాలేమిటి?

రావు: అదే! వారం రోజుల క్రితం ఒక ఉదయం నేను కూడా ఇదే హాలులో ఇట్లాగే గడ్డం చేసుకోవలసి వచ్చిందని.

మూర్తి: అంటే.....(అనుమానంగా) మీ సామాను పోయిందా?

రావు: అవును....

మూర్తి: వాడెవరు, వాడు.....మీ గుడ్డలు బురదలో పారేశాడా?

రావు: నిరభ్యంతరంగానూ! భలేవాడులే ఈ వేదాంతంగారు.

మూర్తి: నేనిక్కడ ఓ క్షణం వుండను.........ఇది కాగానే వెళ్ళిపోతాను.

రావు: ఇంక వెళ్ళిపోవాలనే అనుకుంటున్నారా?

మూర్తి: అంటే.......మీరు వెళ్ళిపోదలుచుకోలేదా?

రావు: వేదాంతంగారూ చాలా నిజం చెప్పారు. నా మటుకు నేను ఇక్కడకు వచ్చిన తరువాత చాలా విషయాలు నేర్చుకున్నాను.

మూర్తి: (షేవ్ చేసుకుంటూ) మరి......అదే.....మీ 'భార్య' సంగతి?

రావు: అక్కడే వచ్చింది చిక్కు?

మూర్తి: మీరిద్దరూ కలిసి వెళ్ళిపోవడమే పెద్దమనిసి చెయ్యవలసిన పని.

రావు: పెద్దమనిషా? అసలలా లేచిరావడం పెద్దమనుషులు చెయ్యవలసిన పనేనా?

మూర్తి: అది వేరు –

రావు: నా మాట వినండి, ఎంతో అనుభవంతో చెబుతున్నాను – ఈ ఆడవాళ్ళు ఎంత తమాషా అయినవాళ్ళు?

మూర్తి: నిజమే! ఎంత ఆశ్చర్యం కలిగిస్తారు? వాళ్ళను అర్థం చేసుకోవడానికి యుగాలు పడతయ్.

రావు: అదేమిటి? నాకు వారం రోజుల్లో ఎంతో అర్థమయిందే?

మూర్తి: ఎంత అసహ్యంగా ప్రవర్తిస్తారు?

రావు: ఎంత అసంభవంగా ప్రవర్తిస్తారు?

మూర్తి: ఆ కవి ఏదో అన్నాడే –

రావు: చాలా అంటారు లెండి, పనీ పాటా లేకపోతే సరి!

మూర్తి: అయినా ఆడవాళ్ళను గురించి చాలా మంచి మాట చెప్పాడండీ?

రావు: అదా? 'క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్' అన్నాడు.

మూర్తి: అబ్బే అది కాదండి! అదే కనుక చెప్పి వుంటే చాలా తప్పు....వాళ్ల చిత్తాలు మారడం నేనింతవరకు

ఎరగను?

రావు: అంటే మీకు ఆడవాళ్ళను గురించి ఏమీ తెలియదన్నమాట!

మూర్తి: నాకా! నాకు ఆడవాళ్ళను గురించి ఏమి తెలియదంటారా?

రావు: అవును...ఆ సంగతి మీరే చెప్పారు కదా!

మూర్తి: అబ్బే! నే నా మాట అనందే! నేను చెప్పింది –

రావు: మీకు తెలియకపోతే తెలుసుకోండి – వాళ్ళు స్వర్గంలోనుంచి అప్పుడే దిగివచ్చిన దేవకన్యల్లా మాట్లాడుతారు.

మూర్తి: దేవకన్యల లాగానా?

రావు: అవును. అది కావాలా, ఇది కావాలా? నేను చెప్పింది చెయ్యండి, మీ రోగం ఠక్కున కుదురుతుంది! యివీ వాళ్ళ మాటలు!

మూర్తి: అబ్బే! నా అనుభవం అది కాదండీ!

రావు: పోనీ మీరు చెప్పండి, వాళ్ళెలా మాట్లాడుతారో?

మూర్తి: నా సంగతే తీసుకోండి! ఇంత జలుబుతోను పొద్దున్నే దిగివచ్చానా? ఈ తనువు కోసమైనా కాస్త తిండి తినాలి కదా! అందుకోసం టేబుల్ ముందు కూర్చున్నాను. అప్పుడేమయింది?

(అంతకు ముందే వేదాంతం వస్తాడు)

వేదాం: ఏమయింది? కడుపునిండా తిన్నారు.

మూర్తి: (కోపంతో) ఓ! మీరా! సమయానికే వచ్చారు. నేను మీ ఇంట్లో నుంచి తక్షణం వెళ్ళిపోవాలనుకుంటున్నాను.

వేదాం: అరె! అట్లాగేనా? చెవి వెనక సబ్బుతో నేనా? (కుడి చెవి వెనక చూసుకుంటాడు మూర్తి) ఆ......అవతల చెవి......(తుడుచుకుంటాడు) ఆ! అదీ!

మూర్తి: తక్షణం –

రావు: మీరు మాతో రావచ్చు.......మేం ఇప్పుడే బయలుదేరుతున్నాం...

మూర్తి: థాంక్స్.....

వేదాం: రెండు జంటలు తక్షణమే ఇక్కడినించి వెళ్ళిపోతున్నారన్నమాట! బావుంది......చాలా బావుంది.....(పేపర్ ఒకటి చూస్తూ వుంటాడు)

(జానకి వస్తుంది)

మూర్తి: జానీ! మనం బయలుదేరుతున్నాం.

జానకి: కాని ఎట్లా?

కమల: (లోపలినుంచి) రావ్! రావ్!

రావు: ఓయ్!

కమల: ఎక్కడ?

రావు: ఇక్కడ హాలులో......!

కమల: నువ్వు సామానంతా సర్దుకున్నావా? (వస్తూ) మనకు టైం లేదు....వెంటనే బయలు దేరాలి.

(అక్కడ అందరినీ చూస్తుంది) మూర్తీ!

రావు: (అర్థం చేసుకుని) మూర్తి!

మూర్తి: కమలా!

జానకి: కమల!

(అందరూ నిశ్చేష్టులౌతారు. ఎవ్వరూ మాట్లాడరు...ఏమీ ఎరుగనట్లు వేదాంతం గారు పేపరు చూస్తూనే వుంటాడు. యుగాలు గడిచినట్లుంటయ్, ప్రతి వాళ్ళకీ)

జానకి: (తెప్పరిల్లి) వేదాంతగారూ! రాం ఏదో ఆలోచిస్తున్నాడు. ఈలోగా మీరు ఆయన భార్యను నాకు పరిచయం చెయ్యవచ్చునే!

వేదాం: క్షమించండి....కమలాదేవీ! ఈమె జానకి –

జానకి: నమస్తే – కులాసాగా వున్నారా?

కమల: (కోపంగా) ఆ –

వేదాం: చూడండి మూర్తిగారూ! ఈయన జోగారావు....యూనివర్సిటీ నుంచి యిప్పుడే వచ్చారు.....జోగారావు గారూ! ఈయన తెలుసుకదా! మూర్తిగారు! పెద్ద రాజకీయ వేత్త!

రావు: మేం ఇదివరకే కలుసుకున్నాం.

మూర్తి: అప్పటికి మనం ఎవరమో పరిచయం లేదు. ఇప్పుడు.....సరే! నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు –

తెలియకపోతే మానివెయ్యడం మంచి పద్ధతి. మనం అందరం ఎలాగో యిక్కడ కలుసుకున్నాం. కలుసుకున్నందుకు ఆనందంగా గడపాలి.

మూర్తి: (చాలా సేపు ప్రయత్నం చేసి, తుమ్ముతాడు)

కమల: ఏమిటండీ అది! జలుబు చేసిందా?

రావు: బాగా జలుబు చేసింది పాపం!

కమల: మీకు ఒంట్లో నలతంటూ ఎరుగరు, యింత వరకూ!

మూర్తి: నిజమే! ఇంతవరకు లేదా.....తీరా జబ్బు చేసేసరికి నావంక ఎవ్వరూ చూడడం లేదు. ఈ వేదాంతంగారు బలవంతంగా మమ్మల్ని అడ్డగించి...

వేదాం: అడ్డగించడం ఏమిటండీ? ఆపా ననండి –

మూర్తి: నా యిష్టమయిందంటాను..ఈయన అడ్డగించి కావాలని జలుబు చేసేటట్లు చేశారు. (జానకిని చూపుతూ) నేను ఇంత బాధ పడుతున్నా, ఈవిడ నా వంక తిరిగి చూడలేదు. (రావుతో) ఇహ ఈయన, నాకు జబ్బుగా వున్నప్పుడు చూసి నా భార్యతో కలిసి పారిపోతున్నాడు (కమలతో) నువ్వు – సరే! నువ్వు నన్నందరికన్నా ఎక్కువగా ఆశ్చర్య పరిచావ్! నువ్విట్లా చేస్తావని నేను కలలో కూడా అనుకోలేదు.

వేదాం: (చప్పట్లు కొడుతూ) మూర్తిగారు పరిస్థితితుల్ని ఎంత గొప్పగా సమీక్షించారో చూశారా! అందుకే ఆయన అంతటి రాజకీయవేత్త కాగలిగారు!! సరే! చివరకు మీరందరూ చేసిన పనులకు విచారపడుతున్నారన్నమాట!

కమల: కాని, మీరు యింత జలుబుతో ప్రయాణం చేస్తున్నారా? ఎంత ప్రమాదమో ఆలోచించారా? వేదాంతగారూ! నాకు కొంచెం గ్లుకోస్, వేడినీళ్ళు కావాలండి!

వేదాం: అయ్యో! వాటికేం?

మూర్తి: (జానకితో) నిజంగా జబ్బును గురించి తెలిసిన మనుషులు రంగంమీదికి వస్తే ఎట్లా వుంటుందో చూశావా?

(బట్లర్ వస్తాడు)

వేదాం: చూడు లోకనాథం! అయ్యగారికి వేడినీళ్ళు కావాలట!

బట్లర్: చిత్తం సార్!

వేదాం: తాగడానికి కాదోయ్, స్నానం చెయ్యడానికి –

బట్లర్: అలాగే సార్, మస్తుగా వున్నయ్....

కమల: కొంచెం గ్లూకోస్ –

బట్లర్: దానికేమమ్మా! అదీ తెస్తును. అయ్యగారికోసం ప్రత్యేకంగా ఒక టిన్ వుందమ్మా!

వేదాం: అదేమిటోయ్! క్రిందటి టిన్ అంతా ఖర్చు అయిందా యేమిటి?

బట్లర్: అంతా ఈ అయ్యగారికోసమో ఖర్చు అయింది సార్!

రావు: (సిగ్గుపడుతూ) నేను నిజంగా దానిమీదనే బ్రతికాను.

వేదాం: ఫరవాలేదు లెండి...కొంచెం త్వరగా తెచ్చి పెట్టు లోకనాథం! అమ్మగారు తొందర పడుతున్నారు –

బట్లర్: చిత్తం సార్....... (వెళ్లిపోతూ)

రావు: వీటన్నింటికంటె కొంచెం పొడుం పీలిస్తే త్వరగా తగ్గిపోతుందనుకుంటాను.

మూర్తి: నీ సంగతి నువ్వు చూసుకో – నీ సలహా లెవ్వరికీ అక్కర్లేదు.

కమల: ఇస్! మీరెక్కువగా మాట్లాడతారు. ఆ మూలకు పోయి కాసేపు విశ్రాంతి తీసుకోండి (అతన్ని లేపి, మూలగా వున్న సోఫా పైకి తీసుకుపోతుంది) జాగ్రత్త! నన్ను పట్టుకుని నడవండి.

జానకి: జలుబు చేస్తు ముక్కుకు బాధగాని, నడిచే కాళ్ళకేం?

రావు: అట్లా అనకండి చాలా ప్రమాదకరం –

వేదాం: ఎంతో అనుభవం ఉన్నట్లుగా మాట్లాడుతున్నారే –

కమల: ఈ కుర్చీలో బావుందా?

మూర్తి: చాలా హాయిగా వుంది.

(కొంచెంసేపు నిశ్శబ్దం)

వేదాం: రావుగారన్నట్లు, మనం అందరం ఇక్కడ ఎట్లాగో కలుసుకున్నాం..కలుసుకున్నందుకు హాయగా గడపాలి.

జానకి: నన్ను మాత్రం వదిలిపెట్టండి. నాకు పనివుంది.

(అంటూ వెళ్లిపోతుంది. పాపం, ఈ సంఘటనలో జానకి బాగా దెబ్బతింటుంది)

వేదాం: చూడండి కమలా! మూర్తిగారిని లోపలకు తీసుకువెళ్ళి, టెంపరేచర్ చూడండి, లోకనాథంతో వేడినీళ్లు కాగబెట్టమనండి, మీ మాటంటే అతనికి బాగా గురి

(కమల మూర్తితో కలిసి వెడుతుంది)

రావు: ఆ.........(రావు ఏదో చెప్పబోతాడు)

వేదాం: ఏమిటి? ఏదో చెప్పబోతున్నట్లున్నారు.....చెప్పండి.

రావు: (పక్కగది వైపు చూపుతూ) ఉస్.....మెల్లగా.....

వేదాం: (నవ్వి) ఫరవాలేదండీ.

రావు: చూడండి. ఈ పరిస్థితుల్లో .....ఆ నేను – మీకు అర్థం అయిందనుకుంటానుజ

వేదాం: అర్థం కాకపోవడమేమిటండీ? ఈ పరిస్థితుల్లో మీలాంటి ప్రతి పెద్దమనిషి చేసేదదే!

రావు: అందుకనే...ఇప్పుడే మెల్లగా జారుకుంటే

వేదాం: బాగానే వుంటుందనుకోండి కాని –

రావు: మీరు నన్ను అనుమానిస్తున్నట్లుగా వున్నారు. నాకు కమలంటే ఎప్పటి అభిమానమూ వుంది.

వేదాం: కాని ప్రస్తుతం మీరు వెడదాం అనుకుంటున్నది పరిస్థితుల ప్రోద్భలం వల్ల నంటారు.

రావు: అవును....నిజంగా అందుకే –

వేదాం: నిజమేననుకోండి. కాని కమల?

రావు: ఆమెకేం? సరే! కమలకు వ్యతిరేకంగా నేనేమీ చెప్పదలుచుకోలేదు.

వేదాం: అరె! ఈ ఇంట్లో అందరూ కమలకే వ్యతిరేకంగా ఏమీ చెప్పదలుచుకోని వాళ్ళే! చాలా బావుంది.

రావు: కాని, చూడండి – మాట వరసకు చెబుతున్నాను...జానకీదేవి సంగతి తీసుకోండి –

(జానకి వస్తుంది)

వేదాం: ఓ! జానకీ దేవి! సరిగ్గా సమయానికే వచ్చారు. రావుగారికి మీ సలహా కావాలట!

రావు: అదేమిటండీ! నేను చెప్పింది అదేనా?

జానకి: చూడండి వేదాంతగారు! నా సామాను తీసుకుని దగ్గర్లో వున్న రైలు స్టేషనుకు వెడదామని పైకి వెళ్ళాను. కాని...కాని నేను వెళ్ళకపోవడానికి ఓ కారణం వుంది. ఆ కారణం మీకు చెప్పాలనే అనుకుంటున్నాను.

వేదాం: మీరు నిజంగా వెడదామనుకుంటున్నారా?

(అవునని తలతిప్పుతుంది జానకి)

మీరు మనస్సు మార్చుకున్నందుకు చాలా సంతోషం.

జానకి: కాని, దానికి కారణం వుంది.

వేదాం: కారణం ఏదయితేనేం? ఆగారు.....మా కదే కావాలి. (రావుతో) చూస్తే జానకీదేవి ఆగింది మీకు సలహా చెప్పడం కోసమే ననిపిస్తోంది.

జానకి: రావుగారికేం కావాలో?

రావు: థాంక్స్....కాని ఆ విషయాలున్నయ్ చూడండి, ఎవరికి వారు చూసుకోవలసినవి.

వేదాం: ఆయన ప్రశ్న ఏమిటో నేను చెబుతాను వినండి: "నేను సామాను సర్దుకుని దగ్గర్లో వున్న రైలుస్టేషనుకు వెళ్ళాలా?" అని.

జానకి: (కంగారుగా) వద్దు, వద్దు.

వేదాం: చూశారా రావుగారూ!

రావు: (ఆశ్చర్యంతో) సరే.....సరే!

(ఇంతలో లోపలినుంచి కమల వేదాంతంగారిని పిలుస్తుంది. ఆయన గుమ్మందగ్గరకు వెడతాడు)

రావు: ఆ! జానకీదేవి! నేను నిజంగా యిక్కడ ఉండాలనే మీ ఉద్దేశ్యమా?

జానకి: అవును....మిమ్మల్ని ఉండమనే కోరుతున్నాను.

రావు: అయితే సరే! తప్పకుండా ఉంటాను.

(లోపలనుంచి కమల వస్తుంది. థర్మామీటర్‌తో సహా – ఆమె వెనుకగా మూర్తి వస్తాడు)

వేదాం: (థర్మామీటరు తీసుకుంటూ) మూర్తిగారికి జ్వరం రావడమంటే రాజకీయ లోకలో విప్లవం రావడమన్నమాట!

మూర్తి: ఎంత ఉంది?

వేదాం: 109^0

మూర్తి: మాట తొమ్మిదా? అమ్మయ్యో!

కమల: భయపడకండి.....తొంభైతొమ్మిదే.

రావు: (వేదాంతం దగ్గరకు వచ్చి) ఇక నేను హాయిగా వెళ్ళవచ్చు.

కమల: (ఆశ్చర్యంతో) ఎక్కడికి?

రావు: ఆయన అనేది – నేనిక హాయిగా మేడ మీదకు వెళ్ళవచ్చునని – మేము ఇప్పుడే పరిస్థితుల్ని ఒక్కసారి సమీక్షించుకున్నాం.

కమల: పరిస్థితులేవి ఇదివరకటిలా లేవు.....నేనిదివరకెప్పుడు మూర్తిగారిని జబ్బు చెయ్యడం అంటే ఏమిటో ఎరుగను. కాని, ఇవ్వాళ?

రావు: అవును....మనం ఎక్కడున్నామో ఒక్కసారి చూసుకుంటే –

వేదాం: ఎందుకు? అదుగో మూర్తిగారు ఆ సోఫాలో – సరే! సోదర సోదరీమణులారా! యీనాటి కార్యక్రమాన్ని నేను ప్రారంభిస్తాను – ఒక చిన్న ఉపన్యాసంతో –

రావు: ఉపన్యాసం అవసరమంటారా?

వేదాం: తప్పకుండా – (మూర్తి ఏదో మాట్లాడబోతాడు)

కమల: ఇస్! ఊరుకోండి.

మూర్తి: నేనేమీ మాట్లాడందే!

కమల: కాని మాట్లాడబోతున్నాను.

వేదాం: జలుబు చేసిన మనిషి చెయ్యవలసిందేమిటో తెలుసా? మాట్లాడకుండా కూర్చుని, ఇతర్లు చేప్పేది వినడం.

మూర్తి: సరే! నేను – (వేదాంతం వారిస్తాడు. మూర్తి మాట్లాడ్డం మానేస్తాడు)

వేదాం: సోదర సోదరీ మణులారా! – పరిస్థితుల వల్ల కానివ్వండి – మరి దేనివల్లనైనా కానివ్వండి రెండు పారి పోతున్న జంటలు నాయింట్లో కలుసుకున్నయ్.....(మూర్తితో) పేర్లు చెప్పవలసిన అవసరం లేదుకదా! నేను చెప్పబోయే దేమంటే – నా ఉపన్యాసం అయిపోయిందని – ఇప్పుడు మూర్తిగారు,

భారతదేశం, ఇదివరకు, ఇప్పుడు, ఇక ముందు – ఎప్పుడూ గర్వించదగ్గ సీత, సావిత్రి, అనసూయల జాబితాలో చేర్చవలసిన కమలా దేవిని – పతిభక్తి పరాయణురాలిని – వదిలి మరొకరితో ఎందుకు పారిపోతున్నారో చెప్పవలసి ఉంటుంది.

మూర్తి: నిజం చెప్పాలంటే – సరే! నేను –

వేదాం: సరే! మూర్తిగా రెప్పుడూ 'కమలకు వ్యతిరేకంగా నేనేమీ చెప్పను' అనే రకం మనిషి. కాని కమలాదేవి కూడా మూర్తిగారికి వ్యతిరేకంగా ఏమి చెప్పదలుచుకోలేదా?

కమల: (మూర్తితో) మీరు నన్నెప్పుడూ సరిగా చూడలేదు. తీరా నాకు జబ్బు చేసేసరికి –

మూర్తి: నీకు యెప్పుడూ జబ్బేనాయె! అక్కడే వచ్చింది చిక్కు.

వేదాం: మీ జీవితంలో మీరు జబ్బే ఎరుగరాయె! అసలు చిక్కు అది. హృదయం లేని మనషి! హోప్ లెస్ క్రీచర్!!

(మూర్తి ఏదో మాట్లాడబోతాడు కమల వారిస్తుంది)

వేదాం: మీకు ప్రమాదకరమైన జబ్బులు చెయ్యకపోతే పోయినయ్, అప్పుడప్పుడూ జలుబు చెయ్యడమా, కనీసం తలనొప్పి రావడం కూడా వుండదయ్యె! ఆడవాళ్ళు యెప్పుడూ మరొకరి కోసం జాలిపడే స్వభావం కలవాళ్ళు అందులో కమలాదేవి మరీను! ఆ మాత్రం తెలియనివారు – అవున్లెండి – మీరు రాజకీయ నాయకులని ఆ జబ్బులకు కూడా తెలిసివుంటుంది.

జానకి: (చిరునవ్వుతో) తప్పకుండా తెలిసే వుండాలి. (మూర్తి ఆమె వంక కోపంగా చూస్తాడు)

వేదాం: కమలాదేవి వంటి స్త్రీలు భారతదేశంలో ఏ కొద్దిమందో కాని వుండరు. సహాయకారిగా వుండే ఆడవాళ్ళు తక్కువ. అటువంటి ఆమెయెడ కూడా మూర్తిగారు పాపాణంలా వర్తించారు.

కమల: మీరు చెప్పింది కొంచెం దురుసుగా లేకపోతే చాలా బావుండేది....అసలు నిజం కూడా అదేకదా!

వేదాం: (మూర్తిని మాట్లాడనివ్వకుండా ఆపి) ఇక రావుగారు –

రావు: ఏమిటి?

వేదాం: మీకు తోచింది మీకు చెప్పండి. అప్పుడు కాని విషయం సవిస్తరంగా తెలుసుకోడానికి వీలు లేదు.

రావు: (కమలకు ఎదురు చెప్పలేదు) కాని...సరే! ఆ.....ఆమె....ఒంటరిగా –

వేదాం: అవును. ఒంటరిగా, భర్తచేత తిరస్కరించబడి – నిజానికి కమలాదేవి మూర్తిగారిని క్షమించగూడదు.

రావు: (మాట మార్చే ప్రయత్నం చేస్తూ) దానికేం, చూడండి –

వేదాం: చూస్తూనే వున్నాను కదా! మనం అందరమూ ఇక్కడ ఉన్నామని – సరే! మనం ఇప్పుడు ఏం చెయ్యబోతున్నాం? మీరు కమలాదేవీ?

కమల: మూర్తిగారికి తగ్గేవరకూ నేనిక్కడే ఉండాలి కదా!

వేదాం: సరే! కమలగారి విషయం తేలిపోయింది ఇక మీరు జానకీదేవీ?

జానకి: నేనూ ఇక్కడ వుండాలి ప్రస్తుతానికి –

వేదాం: వెరిగుడ్.....ఆమె విషయం నిశ్చయమైంది. మరి మీరు రావుగారూ?

రావు: (జానకి వంక చూస్తూ) నేనూ అంతే! ప్రస్తుతానికి –

వేదాం: (మాట మారుస్తూ) దానికేం? ఇక మిగిలింది మూర్తిగారు –

మూర్తి: ఆ..........నేను –

(బట్లర్ వస్తాడు)

బట్లర్: వేడినీళ్ళు కాగినయ్ సార్! అయ్యగారు –

వేదాం: మూర్తిగారి విషయం బాగా నిశ్చయమయి పోయింది...

(కమల మూర్తిని లేవదీసి అతి జాగ్రత్తగా తీసుకు వెడుతుంది. మిగిలిన నలుగురూ దీర్ఘ మయిన నిశ్వాసాలు విడుస్తారు)

(తెర)

రంగము 3

మూడు రోజుల తరువాత నాటి సాయంకాలం. జానకి పెన్సిలతో ఏవో లెక్కలు కదుతున్నది...ఆవిడ చేతిలో పర్సు, రైల్వే గైడూ వున్నయ్. లెక్కలు పూర్తికాగానే, ఏదో నిశ్చయానికి వచ్చినట్లు దీర్ఘ నిశ్వాసం విడుస్తుంది. కొంచెం సేపు ఆగి, వాకిలి దాకా వెడుతుంది.

జానకి: (పిలుస్తూ) జోగారావుగారూ! జోగారావు గారూ!

రావు: (లోపలినుంచి) ఎవరు?

జానకి: ఎక్కడ?

రావు: వచ్చె – (అతను వస్తాడు) సిగరెట్ టిన్ తెచ్చుకుందామని మేడమీదకు వెళ్ళాను. తీరా దిగివచ్చేటప్పుడు టిన్ మరిచిపోయే వచ్చాను.

జానకి: మరీ చిన్నపిల్లవై పోతున్నారు –

రావు: నువ్వేమనుకుంటే, అదే అవుతాను...అయినా నా కిప్పుడు సిగరెట్ తాగడం ఏమీ ఇష్టంలేదు.

జానకి: అరె! మీ మగవాళ్ళెప్పుడూ సిగరెట్ తాగడానికే యిష్టపడతారనుకున్నాను!

రావు: (కొంచెం ఆమెకు దగ్గరగా జరుగుతూ) కాని అని వాళ్ళ వాళ్ళ యిష్టాల మీద ఆధారపడి వుంటయ్......

జానకి: (ఆమెకు తెలుసు అతను ప్రేమపాఠాలు వల్లిస్తున్నాడని! అందువల్లనే కొంచెం జాగ్రత్త పడుతుంది. బయటకు చూస్తూ) ఓహో!

రావు: ఈ మూడు రోజులూ చాలా హాయిగా గడిచినయ్ కదూ?

జానకి: బాగానే గడిచినయ్.

రావు: మనం ఈ మూడురోజుల్లోనూ ఎంత సన్నిహితంగా వున్నాం?

జానకి: అవును.

రావు: నువ్వు నేనంటే చాలా ఆదరం చూపిచావ్!

జానకి: మీరూ అంతే! నేనంటే చాలా దయగా వున్నారు.

రావు: నీకోసం అని వున్నాను కాని, లేకపోతే నేను ఎప్పుడో వెళ్లేవాడిని.

జానకి: మీరు వెళ్లివుంటే నేనేం చేసేదాన్నో నాకే తెలియదు.

రావు: నువ్వేం చెప్పావో జ్ఞాపకం వుందా! 'మిమ్మల్ని వుండమనే కోరుతున్నాను! అన్నావ్...నువ్విట్లా ఎందుకన్నావా అని అప్పటినుంచీ నాకు ఆశ్చర్యంగానే వుంది.

జానకి: మనం స్నేహంగా వుండాలని....మీతో పరిచయం కలిగి, మీరు నన్ను కూడా స్నేహితురాలిగానే భావించాలని –

రావు: మనం స్నేహితులమే కదా? కాదా –

జానకి: అవును....నాకా నమ్మకం యిప్పుడు పూర్తిగా కుదిరింది....ఇకనుంచి మనం స్నేహితులమే.....

రావు: (నిట్టూరుస్తూ, తనలో అనుకుంటున్నట్లుగా) స్నేహితులం!

జానకి: (ఆశ్చర్యంగా చూస్తూ) రావుగారూ!

రావు: (ఆమె వంకకే తిరిగి) ఏం జానకీ?

జానకి: మీరు నాకొక చిన్న సహాయం చేసిపెట్టాలి.

రావు: చిన్నదేమిటి? ఏ పని చెయ్యమంటే ఆ పని చేస్తాను.

జానకి: మిమ్మల్ని అడగవచ్చా, కూడదా అని యిందాకటి నుంచీ ఆలోచిస్తున్నాను.

రావు: ఫరవాలేదు. తప్పకుండా చెప్పు.

జానకి: నిజమే! మనం స్నేహితులం....దగ్గర దగ్గరగా అన్న చెల్లెళ్ళవంటి వాళ్ళం.

రావు: (బిత్తర పోయాడు) సరే! మన స్నేహం ఎటువంటిదైతేనేం కాని –

జానకి: అందుకనే మిమ్మల్ని అడగాలనుకుంటున్నాను.

రావు: అడుగు జానకీ! నీ కోసం నేనేమైనా చెయ్యగలనని నీకు తెలియదా.

జానకి: నిజం, మీరు చాలా దయగలవారు.....(త్వరగా) నాకు అత్యవసరంగా ఆరురూపాయల తొమ్మిదణాలన్నర కావాలి......అప్పుగా –

రావు: అప్పు –

జానకి: ఇవ్వాళ శుక్రవారం. మీకు సోమవారం నాకు మళ్ళీ డబ్బు పంపుతాను. తప్పకుండా – (ఒక్క క్షణం నిశ్శబ్దం) అసలు మగవాళ్ళని ఇటువంటి విషయాల్లో సహాయంక అడుగకూడదు. కాని మా సంగతి వేరు....మనం చాలా చనువుగా వున్నాం – అన్నా చెల్లెళ్ళ మాదిరిగి – మీ కర్థమైందనుకుంటాను.

రావు: కాని......కాని, నాకర్థం కాలేదు.

జానకి: (వివరంగా చెప్పడానికి అభిమానం అడ్డువచ్చింది. కాని చెప్పక తప్పదు) చూశారా! నా దగ్గర అయిదు రూపాయల ఆరణాలన్నర వుంది. ఇంటికి వెళ్ళాలంటే యింకా ఆరు రూపాయల తొమ్మిదణాలన్నర కావాలి. మొత్తం పన్నెండు రూపాయలు......(కొంచెం కోపంగా) ఈ మగవాళ్ళు వృధాగా మా కోసం యింత ఖర్చు పెడతారు కాని మా అవసరానికి ఒక్క కానీ కూడా యివ్వరు...సరే! ఇంటికి వెళ్ళడానకి –

రావు: అదే.........అదే! ఇంత తొందర ఎందుకా అని?

జానకి: తొందరా? నేను ఇక్కడకు వచ్చిన ప్రతి క్షణం నేను ఆలోచిస్తున్నదదే! ఆనాడే నా సామాను తెచ్చుకోవడానికని పైకి వెళ్ళి చూస్తే అయిదు రూపాయల ఆరణాలన్నరే వుంది....నేనేం చెయ్యాలి?

రావు: నువ్వు కావాలనుకుంటే ఎవరు పడితే వాళ్ళు యిచ్చేవాళ్ళే!

జానకి: మూర్తినే తీసుకోండి –

రావు: తీసుకోక తీసుకోక మూర్తిగారినే తీసుకోవాలా? నువ్వాయన దగ్గర చిల్లిదమ్మిడీ తీసుకోవని నాకు

తెలుసు. కాని వేదాంతం గారు?

జానకి: వేదాంతంగారా? మనల్ని యిక్కడకు రప్పించి, భవిష్యత్తు పేరుతో బంధించి వుంచిన ఆయన దగ్గరకు వెళ్ళి: "ఏమండీ వేదాంతగారూ! మీ యింటి నుంచి వెళ్ళి పోవడానికి నాకు ఆరురూపాయల తొమ్మిదణాలన్నర యివ్వండి" అని అడగమంటారా? అసంభవం –

రావు: నిజమే!..కాని నువ్వాయనతో ఈ మూడు రోజులూ స్నేహంగానే వున్నావు కదా!

జానకి: ఆయన అతిథిగా ఆయన ఇంట్లో వున్నప్పుడు గౌరవం చూపించడం నా విధి – ఆ గౌరవాన్ని పురస్కరించుకొని –

రావు: కాని వేదాంతంగారి విషయం వేరు....మనం గాడిదలం కాకుండా కాపాడాడాయన.

జానకి: అందు కాయనకు నేను కృతజ్ఞత చూపించాలా? చూస్తే, ఈ లోకంలో ఏ మగవాడూ, ఏ ఆడదాన్ని అర్థం చేసుకున్నట్లు కనిపించదు.

రావు: (కొంచెం బాధతో) అంటే నువ్వనేది – నేను నిన్ను అర్థం చేసుకోలేదనా?

జానకి: నేననేది – మీరు నేనడిగిన డబ్బుయిస్తే కృతజ్ఞురాలిని, అని......

రావు: అవునవును....నువ్వు యిక్కడనుంచి వెళ్ళిపోవడానికి అంత తొందర పడుతున్నప్పుడు – అంతా చిల్లరగా యివ్వనా?

జానకి: మీ ఇష్టం......

రావు: (డబ్బు లెక్కపెడుతూ) ఇక్కడినుంచీ వెళ్ళిపోవడానికి అంత తొందర –

జానకి: ఇంకా నేను ఇక్కడ వుండడం ఎందుకు?

రావు: అవునవును......(ఏదో చెప్పబోయి) సరే! ఇవిగో! ఆరు రూపాయలు....తొమ్మిదణాలు.....అర్థణా..... (ఇస్తూ) అవును....నువ్వెందుకు వుండాలి? సరే! నేనెందుకిక్కడ వున్నానో తెలుసా?

జానకి: దానికేం? వేదాంతంగారి కోసం వున్నారు. వేదాంతం గారు చాలా మంచివాడు. మనం గాడిదలం కాకుండా కాపాడాడు.

రావు: నిన్ను గురించి, నువ్వు మాట్లాడే మాటల్ని గురించి ప్రస్తుతం వున్న నా అభిప్రాయం చెబితే నువ్వు భూమిమీద ఆగవు –

జానకి: (చాలా శాంతంగా) అంటే – మీరు నన్ను పొరబాటుగా అర్థం చేసుకోలేదు కదా!

రావు: కావచ్చు....కాని ఎట్లా అర్థం చేసుకుంటేనేం? నువ్వు యిప్పుడే వెడుతున్నప్పుడు. (డబ్బు యివ్వబోతాడు. కాని రావు ఆవిధంగా అంటే జానకి డబ్బు తీసుకుంటుందా?)

జానకి: స్నేహితులుగానే కదూ ఆ డబ్బు యిస్తుంది?

రావు: అవును.

జానకి: స్నేహితురాలినే కదూ!

రావు: (కొంచెం తటపాయిస్తూ) అవును.

జానకి: (డబ్బు తీసుకుని) థాంక్స్....మీ మేలు ఎన్నటికీ మరువలేను.(ఆమె త్వరగా వెళ్ళిపోతుంది. రావు ఈ జన్మలో ఆమెను చూడలేదు)

రావు: ఛీ! ఎంత పొరపాటు చేశాను?

(ఒక క్షణం ఆవే మాటలు, జానకి నిష్క్రమించిన వైపుచూచి అనుకుంటాడు. ఇంతలో మూర్తి, కమల వస్తారు. కమల జాగ్రత్తగా నడిపించుకొని వస్తుంది మూర్తిని)

రావు: క్షమించండి – వస్తాను (వెళ్ళబోతాడు)

మూర్తి: (తానొక్కడే వుండవలసి వస్తుందన్న కంగారుతో) వెళ్ళబోయి, వెళ్ళకు..మన ముగ్గురికీ కావలసినంత చోటు వుంది యిక్కడ.

కమల: చూశారా! మూర్తిగారు యింకా మామూలు మనిషి కాలేదు. మళ్ళీ యివ్వాళ జ్వరం వచ్చింది.......(మూర్తితో) ఆ సోఫాలో హాయిగా వుంటుంది. (అతని ప్రక్కనే, రావుకు సాధ్యమయినంత దూరంలో కూర్చుంటూ) మిమ్మల్ని కష్టపెడుతున్నామేమో?

రావు: అబ్బే! కష్టం ఏముంది? నేనెలాగూ వెళ్ళబోతున్నాను.

మూర్తి: అదేమిటి! కొంచెంసేపు కూర్చో. కులాసాగా కబుర్లు చెప్పుకుందాం.

రావు: మేడమీద నా సిగరెట్ కేస్ మరిచిపోయి వచ్చాను – వట్టిగాడిదలాగా –

కమల: అంటే, గాడిదల కంతమతిమరుపు వుంటుందా?

రావు: (కచ్చగా) గాడిదల సంగతి నాకుతెలియదు కాని, పులులు మాత్రం ఏ విషయమైనా యిట్టే మరిచపోతయ్ – అందులో ఆడపులులు మరీను – (వెళ్ళడానికి లేస్తాడు)

మూర్తి: మళ్ళీ త్వరగా వస్తావు కదూ!

రావు: (అయిష్టంగా) మళ్ళీనా? సరే! వస్తాను. (వెళ్లిపోతాడు)

మూర్తి: మాకు వచ్చి కాస్త సాయంగా వుండు.

(కమల ఈలోగా అతనికి దుప్పటి కప్పుతుంది)

అక్కర్లేదు కమలా!

కమల: అబ్బే! వుంచుకోవాలి.....నాకే చలిగా వుంది నీకు అక్కడ మెత్తగా వుందా? లేక మరో దిండు తీసుకురానా?

మూర్తి: చాలా హాయిగా వుంది...నువ్వు అనవసరంగా శ్రమపడకు.

కమల: శ్రమా? నీ కోసం చేసేపని నాకు శ్రమా?

మూర్తి: (నిస్సారంగా) సరే!

కమల: అదీ! (దిండు తెస్తూ) నువ్వు హాయిగా వుండడమే నాకు కావలసింది....ఇప్పుడెట్లా వుంది?

మూర్తి: చాలా హాయిగా వుంది.

కమల: నిజంగానా? నీకేం కావాలసినా నిమిషంలో తెస్తాను

మూర్తి: కావలసినప్పుడు అడుగుతానుగా!

కమల: సరే! ఏదైనా చదవనా? లేకపోతే, కబుర్లు చెప్పుకుందామా;

మూర్తి: నువ్వు చదివితేనే బావుంటుంది...చదువు.

(ఆమె ఓ పుస్తకం తెస్తుంది. ఇంతలో రావు సిగరెట్ టిన్‌తో వస్తాడు)

రావు: క్షమించండి..నేను మీకు అడ్డం కాదు గదా?

మూర్తి: అబ్బే! లేదు.....కమల ఏదో చదవబోతున్నది...కూర్చో.

రావు: (కూర్చుంటూ) ఏమిటా పుస్తకం?

కమల: పతివ్రత –

రావు: మీరు 'చలం'గారి పుస్తకాలేవయినా చదవవలసింది.

మూర్తి: ఏం? అతను బాగా రాస్తాడా?

రావు: బాగా? గొప్పగా రాస్తాడు. అందులో భర్తతో సుఖంలేని భార్యల సంగతి మరీను! (అది కూడా రావును కమల చదివి వినిపించిందే కదా!)

కమల: (మాట తప్పిస్తూ) అరె! నేను గుడ్డలు మార్చుకోవాలి...స్నానం కూడా చెయ్యాలి.

రావు: (తన గడియారం వంక చూస్తూ) అవును.

కమల: మూర్తీ! నువ్వీపూటకు ఆ గుడ్డలతోనే వుండాలి.

మూర్తి: నువ్వు నిన్న కూడా ఇదే మాట చెప్పావ్!

కమల: నిజమే ననుకో! నీకు మళ్ళీ జ్వరం వచ్చింది కదా!

(తన కడుపుమీద తనే చెయ్యివేసి చూసుకుంటాడు. చల్లగా వుంది. కుడిచేతిని ఎడం చేతిమీద పెట్టుకుంటాడు)

రావు: బహుశః ఆ 'పతివ్రత' అంత వుద్రేకం కలిగించి వుంటుంది.

మూర్తి: ఆ పుస్తకం యింకా చదవందే!

రావు: అయితే నిన్నటి వుద్రేకం మిగిలి వుంటుంది.

మూర్తి: (కోపంతో) కావచ్చు.

కమల: (అయిష్టంగానే) వీల్లేదండీ....ఈ ఒక్క పూటకూ మీ కమల చెప్పినట్టు వినాలి.

మూర్తి: సరే!

కమల: మీరెంత మంచివారో నాకు తెలియదా? ...సరే! నేను యిప్పుడే వస్తాను

(వెళ్ళిపోతుంది)

మూర్తి: (దీర్ఘనిశ్వాసం విడిచి) చూడు – (ఆగి పోతాడు)

రావు: ఏమిటి?

మూర్తి: (అది చెప్పకపోవడమే మంచిదనుకొని) ఏమీ లేదు.

రావు: (ఒక క్షణం ఆగి) ఈ ఆడవాళ్ళు ఎంత తమాషా అయినవాళ్ళో!

మూర్తి: (ఆమోదిస్తూ) ఎంత ఆశ్చర్యం కలిగిస్తారు.

రావు: ఎంత అసహజంగా ఆట్లాడతారు!

మూర్తి: ఎంత అసహ్యంగా మాట్లాడుతారు!

రావు: అవును.

మూర్తి: ఈ రోజుల్లో, ఆంధ్రదేశం ఏమీ బావుండదు.

రావు: నాకూ అంతే!

మూర్తి: అంటే....వుత్తరదేశం పోదామనుకున్నామన్నమాట!

రావు: ఆహా!

మూర్తి: ఎక్కడికి? ఢిల్లీకా?

రావు: అంతదూరం కాదు....ముందు హైదరాబాదు....తరువాత ఏ నాగపూరో –

మూర్తి: మేము....నేను....నాకు మాత్రం బొంబాయి బావుంటుంది.

రావు: అబ్బే! ఈ మనుష్యుల బడాయిలు, లడాయిలు తప్ప అక్కడేమీ వుండవు.

మూర్తి: కాదు, కాదు. మనల్ని మనం మరిచోపోవాలంటే అక్కడే వుండాలి....చూడు – మనలో మాట.....నాకు ఆడవాళ్ళంటే ఉత్సాహం పోయింది.

రావు: నాకు మొహం మొత్తిపోయింది.

మూర్తి: నాకు అసహ్యం పుడుతోంది.

రావు: అవును.

మూర్తి: అంటే, నీకు కూడానా?

రావు: అట్లాగే అనిపిస్తోంది.

మూర్తి: ఎంత అర్థం లేకుండా మాట్లాడతారు!

రావు: ఎంత అసహజంగా మాట్లాడతారు!

మూర్తి: అయితే, నువ్వు హోటల్లో, గదులు కూడా 'బుక్' చేశావా?

రావు: ఆహా!

మూర్తి: నేను కూడాను!

రావు: బొంబాయి లోనా?

మూర్తి: అవును....బొంబాయి బాగానే వుంటుంది

రావు: ఇంతకూ నువ్వనేది –

(అంటూ కమల వెళ్ళిన వంక చూపుతాడు)

మూర్తి: (తల వూపుతూ) అవును.......

రావు: అదీ నిజమే! అడ్వాన్సు కట్టి 'బుక్' చేసిన గదుల్ని వాడుకోకపోవడమేం? కనీసం ఒక వూళ్ళో వాటినైనా వాడుకుందాం.

మూర్తి: ఏ వూళ్ళో వాటిని?

రావు: ఈ విషయంలో మనకు పోట్లాటెందుకు? హెడ్స్ ఆర్ టైల్స్ (..........) వేద్దాం....నీకేం కావాలి? బొమ్మా? అక్షరాలా?

మూర్తి: బొమ్మ....బొమ్మపడితే నువ్వు బొంబాయి రావాలి....లేకపోతే నేను హైదరాబాదు వస్తాను.

(ఎగరవేస్తాడు...బొమ్మ పడ్డది)

మూర్తి: అదుగోబొమ్మ! నువ్వు బొంబాయి వస్తావన్న మాటేగా?

రావు: తప్పదుగా! అయితే ఎప్పుడు వెడదాం? రేపు బావుంటుందేమో?

మూర్తి: రేపు మళ్ళీ అవకాశం దొరుకుతుందా? ఈ రాత్రే బయలు దేరితేనేం? వచ్చిన అవకాశం పోగొట్టుకోవడం మంచిది కాదు.

రావు: అంటే – కమలాదేవి బట్టలు మార్చుకుని వచ్చేలోపలేనా?

మూర్తి: అవును....ఇదే మంచి అవకాశం....ఈ రాత్రికి హైదరాబాదులో – రేపు బొంబాయి వెళ్ళడం....

రావు: ఆవిడ మన వెంటనే బయలుదేరుతుంది.

మూర్తి: నాన్సెన్స్! ఎందుకు బయలుదేరుతుంది?

రావు: నీకింకా కమల సంగతి పూర్తిగా తెలియదన్నమాట!

మూర్తి: ఏమిటి? నాకు కమల సంగతి తెలియదా! బావుంది.

రావు: (నచ్చ చెబుతూ) ఆవిడ తప్పకుండా మీ వెంట పడుతుంది. ఎవరికైనా జబ్బు చేస్తే సేవ చెయ్యడం ఆవిడకు చాలా ఆనందం. అందులో మీవంటి రోగిని అసలు వదులుకోదు.

మూర్తి: నావంటి వాణ్ణా! నాకు తెలియదే ఆ సంగతి!

రావు: మూర్తిగారూ! మీకు ఆవిడతో పరిచయం మూడు రోజులే!! నాకు ఆరు రోజులు! అందువల్ల మనం –

(వేదాంతంగారు వస్తాడు)

వేదాం: ఏం మూర్తిగారూ! ఏవో రహస్యాలు మాట్లాడుకుంటున్నారు!

రావు: ఇప్పుడే మీ మాట చెప్పబోతున్నాను...సరిగ్గా సమయానికే వచ్చారు.

మూర్తి: (చెప్పవద్దన్నట్లుగా) ష్!

వేదాం: ఆయన నాకేదో చెప్పాలనుకుంటూ వుంటే, మధ్య మీ 'ష్' ఎందుకు చెప్పండి?

రావు: ఫరవాలేదు. వేదాంతంగారు పెద్దమనిషజ.

వేదాం: భేష్! (మూర్తితో) చూశారా మీ ప్రక్కన నాకున్న పలుకుబడి! (రావుతో) ఏమిటి మీరు చెప్పబోతున్నది? ఇక్కడనుంచి వెళ్ళిపోబోతున్నారు కాబోలు! అవునా?

మూర్తి: ఆ.....ఆహా! మేము –

రావు: అరె! మికెట్లా తెలిసింది?

వేదాం: అదేమిటి! మూర్తిగారి కారు ఆయన కోసం ఇరవై నాలుగు గంటలనుంచి కనిపెట్టుకొని వుంది.

మూర్తి: నిజం?

వేదాం: మీరు కూడా ఆయనతో వెదుతున్నారా రావుగారూ?

రావు: అవును....వెదదామనే అనుకుంటున్నాను. కాని మీకు మాత్రం కృతజ్ఞుణ్ని.

వేదాం: నేనేమనుకున్నానో తెలుసా? సరి! తీరా వెడుతున్నప్పుడు చెప్పడమెందుకు?

మూర్తి: చూడండి...నేను...నా సంగతి....మళ్ళీ వంట్లో కొంచెం బావుండగానే – వస్తాను. వస్తాననుకోండి – ఈ లోగా ఆవిణ్ని కొంచెం – మీకు జ్వరం వచ్చిందో – అదే! నటించో...ఆ! నేననేది – ఆ రావుగారి నడగండి.

వేదాం: (నవ్వుతూ) మీరనేది రావుగారి కెలా తెలుస్తుందండీ? మూర్తిగారూ! ఎందుకీ సంజాయిషీలు? మీ దంపతుల విషయంలో జోక్యం కలిగించుకోవడానికి నేనెవర్ని. మీరు, రావు వెళ్ళిపోతున్నామనండి...... బావుంటుంది. అంతేకాని –

రావు: కాని కమలాదేవి సంగతి? ఈ పరిస్థితులలో మూర్తిని – అందులోనూ జ్వరం తగిలిన మూర్తిని ఆవిడ చస్తే వదులుకోదు.

వేదాం: అంటే, ఆవిడ యిక్కడే వుండాలన్నమాట!

రావు: అంతే!

వేదాం: ఆవిడ యిక్కడ వుండదలచుకోకపోతే!

మూర్తి: మీరు అందర్నీ ఎలా వుంచగలుగుతున్నారు?

వేదాం: గౌరవంతోనూ, నచ్చచెప్పీ –

మూర్తి: ఆ మాత్రానికేనా కమల వుండిపోతుందనుకోను.

వేదాం: ఆ సంగతి మీకు బాగా తెలుసుననుకోండి. ఎంతగా ఆలోచించినా ఈ పవిత్రుడికీ, ఆ పతివ్రతకూ వియోగం కలిగించడానికి ఒక్కటే మార్గం కనిపిస్తుంది.

మూర్తి: ఏమిటిది? (బట్లర్ వస్తాడు)

వేదాం: మీ దొరగార్లిద్దరూ యిక్కడినుంచి వెళ్ళిపోతున్నారు. కారు సిద్ధం చేయించు.

బట్లర్: నిన్నటినుంచీ సిద్ధంగా వుంది సార్!

వేదాం: సరే! వీళ్ళ సామాన్లు సర్దించి ఒకసారి యిలారా!

బట్లర్: చిత్తం సార్! (వెళ్లిపోతాడు)

వేదాం: ఇంకా సామనేమైనా మిగిలితే, తరువాత పంపుతాను.

రావు: థాంక్స్.

మూర్తి: మీరు నిజంగా చాలా మంచివారండీ.

వేదాం: ఆ! నిజంగా?

మూర్తి: ఇంతకూ యిందాక మీరు చెప్పబోతున్న మార్గం – ?

వేదాం: ఏముంది? కమలాదేవి సపర్య చెయ్యడానికి మూర్తిగారికి బదులు మరొక రోగి కావాలి.

రావు: బాగా చెప్పారు!....అంత మంచి మార్గం కనిపెట్టిన మీరే.

వేదాం: అదేమిటి? నేనా? నేను అంతత్యాగం చెయ్యలేను. మా బట్లర్ అయితే –

బట్లర్: (వస్తూనే) ఏమి కావలెను సార్!

వేదాం: లోకనాథం! నీకెప్పుడైనా జబ్బు చేసిందా?

బట్లర్: ఎప్పుడూ చెయ్యలేదు సార్ – కొంచెం కూడా!

వేదాం: అబ్బే! అదేం బాగాలేదు. మరొకళ్ళ చేత సపర్య చేయించుకోకపోవడం ఏమీ బాగాలేదు.

రావు: (బట్లర్‌తో) చూడవోయ్! నువ్వు జ్వరం వచ్చినట్లు నటించాలి.

బట్లర్: ఎందుకు సార్?

మూర్తి: ఆ.....అదే!

వేదాం: కమలాదేవి గారు మంత్రసారి కోర్సు చేస్తుంది. సామాన్యంగా ఎవ్వరూ నయం చెయ్యలేని రెండు జబ్బుల్ని కుదిర్చింది. మరొకటి కూడా నయం చేస్తే ఆవిడ దాన్లో పాస్ అవుతుంది.

రావు: అవునవును.

బట్లర్: అంటే....మూడో భాగం నాకు రావలెనంటారా.

మూర్తి: ఆ.....అంతే –

బట్లర్: ఏమోసార్! నాకు భయం వేస్తోంది.

రావు: భయమెందుకు? చాలా హాయిగా వుంటుంది.

మూర్తి: (అసహ్యంగా ఫీలయి) అసలు మేమే...నిజంగా నువ్వు......నీకేమీ కష్టం కలగదు.

వేదాం: మూర్తిగారు హామీఇస్తున్నారోయ్ నీకు. నీకేమీ భయం వుండదు. పైగా నీ శరీరానికి లాభం వుంటుంది.

బట్లర్: ఏమో సార్; నాకు మాత్రం ధైర్యం చాలడం లేదు సార్!

వేదాం: సరే!

(బట్లర్ వెళ్ళిపోతాడు)

రావు: సరే! ఒకళ్ళ విషయం తేలిపోయింది. (వేదాంతంగారితో) మరి మీసంగతి? మీకూ యిష్టం లేదా? ఇంకా కొంచెంసేపాగితే విప్లవం చెలరేగుతుంది.

వేదాం: సరే! ఏదో ఒకటి చెయ్యకతప్పదు కదా! కానివ్వండి....మిమ్మల్ని నేనెందుకు కష్టపెట్టాలి?

మూర్తి: మీకిష్టమేనా?

వేదాం: ఆ!

మూర్తి: అంటే –

వేదాం: అంటేలూ, గింటేలూ కుదరవు. త్వరగా నిష్క్రమించండి.

రావు: (వెళ్ళబోతూ) రెండో అధ్యాయం చాలా చక్కగా ముగిసేటట్లు వుంది.

వేదాం: వినండి! ఆవిడ వస్తున్నట్లుగా వుంది!

మూర్తి: ఓ!

(వాళ్ళు త్వరగా నిష్క్రమిస్తారు. వేదాంతం ఒంటరిగా ఆలోచిస్తూ వుంటాడు. ఏం జబ్బు చెయ్యడమా అన్నది ప్రశ్న – ఇంతలో బట్లర్ వస్తాడు)

వేదాం: చూడు లోకనాథం! నీ శరీరానికి జబ్బు చేసేటట్లు చెయ్యడం నీకు చేతకాదు కాబట్టి ఆ భారాన్ని నేనే మోస్తున్నాను.

బట్లర్: మీ సంగతి నాకు తెలియదా సార్!

వేదాం: అవునవును. బాగా తెలుసు....సరేగాని నా కిప్పుడు ఏ రకమైన జబ్బుచేస్తే బావుంటుందంటావ్?

బట్లర్: (ఆలోచించి) కాళ్ళనొప్పులు సార్.

వేదాం: ఏమో! నాకెప్పుడూ రాలేదు. సక్రమంగా వుంటయ్యంటావా?

బట్లర్: ఎందుకు వుండవు సార్? అదీ గాక అప్పుడు మీరు భోజనం చెయ్యడానికి ఏ అభ్యంతరం వుండదు సార్.

వేదాం: నిజమే సుమా! నేను భోజనం సంగతే ఆలోచించలేదు.

బట్లర్: మరి జలుబుతోనో సార్ –

వేదాం: ఇబ్బంది లేదు కాని, అందరికీ ఒకటే జబ్బు వస్తే ఎంతవాళ్ళకయినా అనుమానం కలగవచ్చు కదా!

బట్లర్: అదీ నిజమే సార్!

(ఒక క్షణం నిశ్శబ్దం. ఇంతలో)

కమల: (లోపల్నుంచి) లోకనాథం...లోకనాథం!

బట్లర్: ఆవిడ వస్తున్నట్లుగా వుంది సార్! ఏం చేద్దాం?

వేదాం: నేనేదో ఒకటి చేస్తాను కాని నువ్వు వెళ్లి ఆవిణ్ణి కాసేపటి వరకు యిక్కడకు రానివ్వకు....ఈ లోపల నాకు జబ్బు చెయ్యాలి.

బట్లర్: చిత్తం సార్.......(త్వరగా వెడతాడు)

(వేదాంతం సోఫాలో పడుకుని మూలుగుతాడు. ముందు చెయ్యి తలమీద పెట్టుకుని కణతలు చూసుకుంటాడు. తరువాత కడుపుమీద, మోచేతుల మీద, మెకాళ్ళమీద చూసుకుంటాడు. ఎంతసేపటికి కమల రాదు. మధ్య మధ్య తల ఎత్తి చూస్తూ వుంటాడు. ఎవరో వస్తున్న చప్పుడవుతుంది. మూలుగుతూ కళ్ళు మూసుకుంటాడు. ఇంతలో జానకి వస్తుంది. ఒక చేతిలో సంచి వుంది. మూలుగు విని 'ఏమిటి?' అని కంగారు పడుతూ త్వరగా వస్తుంది)

వేదాం: (ఏం చెప్పడానికీ తోచక) అబ్బ! తల పగల కొట్టుకుపోతుంది.

జానకి: ఏమయింది? (అంటూ దగ్గరకు వచ్చి కణతలు పట్టుకు చూస్తుంది)

వేదాం: అబ్బా? తల – (జానకిని చూస్తాడు ఉత్సాహంతో) ఓ! మీరా జానకీ!!

జానకి: అవును....ఏమయింది?

వేదాం: భయంలేదు. కాని కంగారు పడ్డప్పుడు మీ వంటివాళ్ళ ముఖాలు మరీ బావుంటాయి సుమా.

జానకి: (పొగుడుతూ ఉంటే ఎవరికి బావుండదు? కాని జానకి దాన్ని దాచుకుంటుంది) నేను ఈ పాటికి వెళ్లిపోయేదాన్ని.

వేదాం: నాకు చెప్పకుండానే!

జానకి: (సిగ్గుపడి) అవును.

వేదాం: ఏం?

జానకి: వెళ్లిన తర్వాత రాసేదాన్ని –

వేదాం: ఓ కార్డు –

జానకి: ఓ కవరు.

వేదాం: మీ ఆతాథ్యానికి కృతుజ్ఞురాల్ని....ఇట్లు, పరిచయస్థురాలు.

జానకి: ఇట్లు, స్నేహితురాలు.

వేదాం: తాజా – మిమ్మల్ని ఎప్పటికీ చూడను.

జానకి: మిమ్మల్ని ఎప్పటికీ మరిచిపోలేను.

వేదాం: కాని నువ్వు తప్పకుండా మరిచిపోవాలి.

జానకి: అదే మంచిదంటారా?

వేదాం: దాదాపూ అంతే! ఎప్పుడూ జరిగేదదే! ఆ! నీ వేళ్ల మహిమ చూశావా? నా తల నొప్పి అప్పుడే తగ్గుతోంది.

జానకి: నేను ఒక్క నిముషమే యిక్కడ వుండేది.

వేదాం: (ఏదో చప్పుడవుతోంది) ఏమిటది?

జానకి: ఏమో! నాకూ యిప్పుడే వినిపించింది.

వేదాం: ఆ! ఎలుకలో, పందకొక్కులో చిన్నవైతే ఎలుకలు, పెద్దవైతే పందికొక్కులు.

(ఇంతలో మూర్తి, రావులు కిటికీ నుంచి కనిపిపించి నిష్క్రమిస్తారు)

జానకి: ఏమిటది?

వేదాం: అది నీ జీవిత కావ్యంలో ఒక ఘట్టం – అయిపోయింది, మరిచోపోయింది, మరణించింది.

జానకి: అసలది జరగనే లేదోమో? అవునా!

వేదాం: కావచ్చు....కేవలం కలలాంటిది!

(బట్లర్ వస్తాడు)

వేదాం: నాకు పార్శ్వంనొప్పి వచ్చింది లోకనాథం!

బట్లర్: విన్నాను సార్! కొంచెం జాగ్రత్తగా వుండాలి సార్!

వేదాం: జానకీ దేవి నిన్ను చాలా జాగ్రత్తగా చూస్తోంది.....ఆ! ఇంతకూ నీకేం కావాలి?

బట్లర్: కమలమ్మగారు రాత్రికి కనిపించరట సార్! ఆ మాట చెప్పమన్నారు సార్!

వేదాం: (జానకితో) కనిపించక పోతే ఏమైనా ప్రమాదమా?

బట్లర్: రాముడికి సడెన్‌గా జబ్బు చేసింది సార్!

వేదాం: అరె! నేను రాముడి సంగతే మరిచిపోయానే!

(అని నాలుక కొరుక్కుంటాడు)

జానకి: పాపం! రాముడికి జబ్బేమిటి?

బట్లర్: గొంతు నొప్పి చేసిందటమ్మా! అన్నం తిననివ్వదు..నీళ్ళు తాగనివ్వదు. కొంచెం జాగ్రత్తగా ఉండాలంటున్నారు అమ్మగారు.

వేదాం: కమలాదేవిగారిక థాంక్స్ చెప్పు.

బట్లర్: అలాగే సార్!

(వెళ్ళిపోతాడు)

వేదాం: నువ్విప్పుడు వెళ్ళవద్దు జానకీ వుండాలి..

(జానకి తల అడ్డంగా తిప్పి నవ్వుతుంది.)

తప్పకుండా వెళ్ళాలా?

జానకి: అవును.

వేదాం: మీ నాన్నగారి దగ్గరకేనా?

జానకి: అవును.

వేదాం: సరే! వెళ్ళిరా.....నీ చేతులలో ఏదో మాజిక్ ఉంది.....(నిట్టూర్చి) మనం యిక విడిపోదాం.

జానకి: వెళ్ళొస్తాను. మిమ్మల్ని ఎప్పటికీ మరిచిపోలేను. మా నాన్నలా వున్నారు...మీ కెప్పటికీ కృతజ్ఞురాల్ని.

(ఆవిడ వెళ్ళిపోతుంది; విజయగర్వంతో. అద్దంలో తన ప్రతిబింబం చూసుకుని నవ్వుకుంటాడు. ఇంతలో బట్లర్ వస్తాడు)

వేదాం: లోకనాథం! నాకు ఎన్నిఏళ్ళు వున్నాయంటావ్?

బట్లర్: ఎన్నైనా వుండవచ్చును సార్!

వేదాం: కాని నేనొక్కక్కప్పుడు చాలా కుర్రవాణ్ణిగా కనిపిస్తాను కదూ!

బట్లర్: అవును సార్....పసిపిల్లల్లా కనిపిస్తారు.

వేదాం: నేను వాళ్ళ నాన్నలాంటి వాడినంది జానికీ దేవి!

బట్లర్: బాగా అన్నారు సార్!

వేదాం: అవును....ఇకముందు అటువంటి పొరపాట్లు రాకుండా వుండడానికి ఒక తెల్లటి గడ్డం అతికించుకోవాలి.

బట్లర్: అయితే, బజారులో ఆర్డరు చెయ్యమంటారా సార్!

వేదాం: థాంక్స్....తరువాత ఆలోచిద్దాం.

బట్లర్: ఈ వారంరోజులు బాగా గడిచినయ్ సార్!

వేదాం: చాలా బాగా గడిచినయ్....నాకు చాలా వయసుమీరిన పిల్లలున్నారు ఈ వారంలో.....తెలుసా?

(వాళ్ళు ఒకళ్లనొకళ్లు చూస్తూ నిలబడ్డారు. మరుక్షణంలో వాళ్ళ హోదాలు మరిచిపోయి వాళ్ళిద్దరూ మెల్లిగా నవ్వు మొదలుపెట్టి విపరీతంగా నవ్వుతారు. మధ్యలో వేదాంతం "చూడు చూడు ఈ పిల్లలు", "వీళ్ళకు నేను నాన్నని" అంటాడు. "చాల బావుంది సార్" అంటూ బట్లరు నవ్వుతాడు.

ఇంతలో వాకిలి తలుపు చప్పుడు అవుతుంది. వాళ్లు ఎవరి ఉద్యోగంలో వాళ్ళు ప్రవేశిస్తారు. బట్లర్ గదిలో సామానులన్నీ సర్దుతాడు. అంతా మొదటి రంగంలానే వుంటుంది. బట్లర్ వెళ్లి తలుపు తీస్తాడు. తలుపు అవతల నుంచి మాటలు వినిపిస్తాయ్)

మనిషి: చూడండి....ఇది హోటలేనా?..మేము దారితప్పినట్లుగా వున్నాం.....ఈ రాత్రికి యిక్కడ ఉండవచ్చా? మేము –

(తెర)